Follow: @ANNTELUGU
09-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 132 | పేజీలు-08 | వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణకు జలద్రోహం చేస్తే
# బొంద పెడుతాం

### దసరాలోపు పనులు మొదలుపెట్టకుంటే పాదయాత్ర
### చౌదరిగూడెం సభలో టీఆర్ఎస్ చీఫ్ కవిత


**షాద్ నగర్,మహా:** నీళ్ల కోసమే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో, స్వరాష్ట్రం సిద్ధించిన పన్నెండేళ్ల తర్వాత కూడా సాగునీటి కోసం రైతులు ఆవేదన చెందడం చారిత్రక విషాదమని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు జలద్రోహం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని కిలోమీటర్ లోతున బొంద పెట్టడం ఖాయమని ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం చౌదరిగూడెం మండల కేంద్రంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సాధన భారీ బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. అంతకముందు చౌదరిగూడ మండల కేంద్రంలో మొట్టమొదటి పార్టీ జెండాను పార్టీ శ్రేణులతో కలిసి ఎగరావేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు ఆమెకు డప్పు వాయిద్యాలతో, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి సభ ప్రాంగణంలోకి తరలి వెళ్ళారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

### కేరళ సీఎంగా కేసీ వేణుగోపాల్?


- 47 మంది ఎమ్మెల్యేల మొగ్గు అటే
- అభిప్రాయ సేకరణలో సతీషన్ వైపు 6, రమేష్ కు 8మంది మద్దతు
- హైకమాండ్ కోర్టులో బంతి.. సతీషన్ కు మద్దతుగా మిత్రపక్షాలు
- నేడో రేపో ఉత్కంఠకు తెర



02

### బెంగాల్ సీఎం సువేందు అధికారి


- ప్రకటించిన అమిత్ షా
- నేడు ప్రమాణం.. ఈ విజయం అసాధారణం



02

### ఇక రాయల్ సీమ

- తిరుపతికి భారీ పెట్టుబడులు
- రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ఏపీ సీఎం చంద్రబాబు ఆసక్తికర ట్వీట్



03



# విజయ్‌కు మళ్లీ బ్రేక్

### మూడోసారి కూడా గవర్నర్ షాక్.. రాజ్‌భవన్ గుమ్మంలో ఆగిన మద్దతు లేఖలు
### 116 దగ్గరే ఆగిపోయిన దళపతి రథం..
### మ్యాజిక్ ఫిగర్‌కు ఒక్క అడుగు దూరంలో విజయ్ ప్రమాణస్వీకారంపై తీవ్ర ఉత్కంఠ

**చెన్నై, మహా:**

తమిళనాడు రాజకీయాల్లో క్షణక్షణానికో ట్విస్ట్ చోటుచేసుకుంటోంది. మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటు ఖాయమైందని, శనివారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం జరగనుందని అంతా భావించిన తరుణంలో మళ్లీ సందిగ్ధత అలుముకుంది. కీలక పక్షాలైన వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల మద్దతు లేఖలు గవర్నర్‌కు చేరకపోవడంతో టీవీకే కూటమి బలం 116కే పరిమితమైంది. మ్యాజిక్ ఫిగర్ 117కు అత్యంత సమీపంలో విజయ్ కూటమి ఆగిపోవడంతో, రాజ్‌భవన్ నుంచి ప్రమాణ స్వీకారానికి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

మిగతా 2లో



### మళ్లీ మొదటికొచ్చిన రాజకీయ ఉత్కంఠ

విజయ్ ముఖ్యమంత్రి కావడం లాంఛనమే అని భావించిన తమిళనాట రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. ద్రావిడ గడ్డపై ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగి, అధికార పీఠాన్ని అధిరోహించేందుకు సిద్ధమైన విజయ్‌కు అనూహ్య అవరోధం ఎదురైంది. మిత్రపక్షాలన్నీ బేషరతుగా మద్దతు ప్రకటించాయన్న ధీమాతో ఉన్న టీవీకే వర్గాలకు తాజా పరిణామం మింగుడుపడటం లేదు. ప్రమాణ స్వీకారానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం రాజ్‌భవన్‌కు అధికారికంగా చేరకపోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

### దారితప్పిన మద్దతు లేఖలు

ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో సాంకేతిక, రాజకీయపరమైన చిక్కులు తాజాగా తెరపైకి వచ్చాయి. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు వీసీకే (విడుతలై చిరుతైగల్ కట్చి), ఐయూఎంఎల్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్) పార్టీలు కూడా విజయ్‌కు అండగా నిలుస్తాయని నిన్నటి వరకు వార్తలు వచ్చాయి. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. రాజ్‌భవన్ వర్గాల సమాచారం మేరకు.. కేవలం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీల నుంచి మాత్రమే అధికారిక మద్దతు లేఖలు గవర్నర్‌కు అందాయి. వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల అధినాయకత్వాల నుంచి ఆశించిన మద్దతు పత్రాలు ఇంకా దాఖలు కాకపోవడం ఈ తాజా ప్రతిష్టంభనకు ప్రధాన కారణమైంది.




# కొడంగల్‌ను బంగారు తునకలా తీర్చిదిద్దుతా...

## 2034 దాకా రాజకీయాలు వద్దు

### మన గడ్డ అభివృద్ధిపైనే గురి!
### మెట్ట భూములకు కృష్ణమ్మ జలాలు
### లగచర్లలో 220 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్!
### ఆధ్యాత్మికం.. విద్యా.. వైద్యం
### సొంత నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వరాల జల్లు!
### రూ. 110 కోట్లతో శ్రీవారి ఆలయానికి భూమిపూజ
### 430 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన!



**హైదరాబాద్, మహా:**

తనకు రాజకీయ భిక్ష పెట్టిన కొడంగల్ గడ్డను దేశానికే ఆదర్శంగా, ఒక 'బంగారు తునక'లా తీర్చిదిద్దడమే తన అంతిమ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం తన సొంత నియోజకవర్గంలో పర్యటించిన ఆయన, వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గతంలో ఈ ప్రాంతానికి ఒక్క మంత్రి పదవి కూడా రాలేదని, కనీస సమస్యల పరిష్కారం కోసం ఇతరులను యాచించాల్సిన పరిస్థితి ఉండేదని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న తనకు ముఖ్యమంత్రి పదవి దక్కడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, అందుకే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని భావోద్వేగంతో పలికారు.

**పేదల తిరుపతిగా శ్రీ వేంకటేశ్వర ఆలయం.. ఆధ్యాత్మిక హబ్‌గా కొడంగల్**

కొడంగల్‌ను ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేందుకు రూ. 110 కోట్ల భారీ వ్యయంతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు.

మిగతా 2లో

# ప్రాణహితకు జలహారతి

- మంత్రులు జూపల్లి, వివేక్ ప్రత్యేకపూజలు
- తుమ్మిడిహెట్టి పునరుద్ధరణకు కృషి
- మహారాష్ట్రతో త్వరలో చర్చలు
- సీఎం రేవంత్ ఆదేశాలతో పర్యటన
- తెలంగాణ ఎంపీలు, కేంద్ర మంత్రులు సహకరించాలని మంత్రుల విజ్ఞప్తి



**ఆదిలాబాద్, మహా :**

తెలంగాణ సాగునీటి రంగానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పునరుద్ధరణకు కృషి చేస్తోందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం తుమ్మిడిహెట్టి ప్రతిపాదిత ప్రాంతాన్ని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి సందర్శించి ప్రాణహిత నదికి ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన అంశాలపై సాగునీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రాజెక్టు బరాజ్ ఎత్తు, సామర్థ్యం, మహారాష్ట్రలోని శివిని గ్రామ ముంపు పరిస్థితులు, అటవీ మరియు పర్యావరణ అనుమతులు తదితర అంశాలపై అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో రూ.38,500కోట్ల అంచనా వ్యయంతో 16లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని గుర్తుచేశారు. అప్పట్లోనే 106 కిలోమీటర్ల కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా, 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తి చేసి, 46 కిలోమీటర్ల పనులు చేపట్టినట్లు తెలిపారు.అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కనబెట్టి కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర ఖజానాపై భారీ భారం మోపిందని విమర్శించారు.

మిగతా 2లో

# ప్రేమ 'శిక్ష'... కత్తుల వేట!

### సికింద్రాబాద్‌లో బీటెక్ విద్యార్థి దారుణ హత్య
### నడిరోడ్డుపై రక్తపు మడుగులో యవన్
### 17 సార్లు కత్తితో పొడిచి కిరాతకంగా చంపిన యువతి బంధువులు
### సీతాఫల్‌మండిలో యువకుడిని వేటాడి చంపిన దుండగులు




**హైదరాబాద్, మహా:** ప్రేమ వ్యవహారం ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటన సికింద్రాబాద్ పరిధిలో తీవ్ర కలకలం సృష్టించింది. తన కూతురిని ప్రేమిస్తున్నాడన్న కక్షతో, యువతి బంధువులు ఒక యువకుడిని మృగాల్లా వేటాడి, నడిరోడ్డుపై అతి కిరాతకంగా హత మార్చారు. జవహర్‌నగర్ ప్రాంతానికి చెందిన యవన్ (23) అనే బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి, సీతాఫల్‌మండికి చెందిన ఒక యువతిని గత నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాడు. వీరి ప్రేమ విషయం తెలిసిన యువతి తల్లిదండ్రులు పలుమార్లు యవన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. అయినప్పటికీ, తన ప్రేమను వదులుకోలేకపోయిన యవన్, సీతాఫల్‌మండిలో ఉండే తన స్నేహితుడి ఇంట్లోనే ఉంటూ తరచూ ఆ యువతిని కలుస్తుండేవాడు. తమ హెచ్చరికలను లెక్కచేయకుండా తమ కళ్ల ముందే తిరుగుతున్నాడన్న కోపం యువతి కుటుంబ సభ్యుల్లో కక్షగా మారింది. బుధవారం రాత్రి యవన్ తన స్నేహితుడి ఇంటి వద్ద ఉన్న సమయంలో, పక్కా పథకం ప్రకారం మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు దుండగులు అతడిపై ఒక్కసారిగా కత్తులతో దాడికి దిగారు. ఊహించని ఈ దాడితో షాక్‌కు గురైన యవన్, వారి నుంచి తప్పించుకుని ప్రాణాలు కాపాడుకోవడానికి నడిరోడ్డుపైకి పరుగులు తీశాడు.

మిగతా 2లో



## తెలంగాణకు మోదీ
# నవ వసంతం

### రేపు హైదరాబాద్ పై ప్రగతి సంతకం
### ₹7,823 కోట్ల అభివృద్ధి పనులు
### బీబీనగర్ ఎయిమ్స్ జాతికి అంకితం.. ఎంఎంటీసీ2కు శ్రీకారం
### ప్రధాని పర్యటనకు భారీ ఏర్పాట్లు

వివరాలు 4లో

# ప్రాణహితకు జలహారతి

(మొదటిపేజీ తరువాయి)

గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ పంపుల ద్వారా ఎత్తిపోతల విధానాన్ని అమలు చేయడంతో విద్యుత్ భారం పెరిగిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ నీటిని వినియోగించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మిస్తే ఎలాంటి విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని చెప్పారు. దీంతో సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు ప్రాంత రైతులకు భారీగా లాభం చేకూరుతుందని వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో చర్చలు జరిపి 150 మీటర్ల మేర బరాజ్ నిర్మాణానికి అంగీకారం పొందేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదని, భూములు కోల్పోయే వారికి తగిన పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కోరారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రాణహిత ప్రాజెక్టును కమిషన్ల కోసమే తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరానికి తరలించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని మాజీ సీఎం కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం అప్పుల పాలైందని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ప్రాణహిత ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. తెలంగాణ బీజేపీ ప్రజాప్రతినిధులు కూడా ఈ ప్రాజెక్టు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నిఖిత పంత్, చూసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, గ్రంథాలయ చైర్మన్ కాష్టే అనిల్ తదితరులు పాల్గొన్నారు



# కొడంగల్‌ను బంగారు తునకలా తీర్చిదిద్దుతా...

(మొదటిపేజీ తరువాయి)

తిరుమలలో ఏ రకమైన ఆగమ శాస్త్ర పూజలు జరుగుతాయో, ఇక్కడ కూడా అదే స్థాయిలో వైభవం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేశంలోనే గొప్ప ఆగమ శాస్త్ర కోవిదుడైన సుందరవరదాచార్యుల సేవలను సీఎం కొనియాడారు. వారి గౌరవార్థం ఆలయ ప్రాంగణంలోని ఒక విభాగానికి సుందరవరదాచార్యుల పేరు పెడతామని ప్రకటించారు. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా భక్తులు తరలివచ్చేలా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దీనితో పాటు దౌల్తాబాద్ వేంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి వేణుగోపాల స్వామి ఆలయాల అభివృద్ధికి కూడా శంకుస్థాపనలు చేస్తూ ఆధ్యాత్మిక పర్యాటకానికి పెద్దపీట వేశారు.

### లగచర్లలో విద్య, వైద్య విప్లవం..
### 220 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్

కొడంగల్ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా రంగంలో సీఎం రేవంత్ రెడ్డి భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. లగచర్ల వద్ద 220 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన 'ఎడ్యుకేషన్ హబ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నాడు ఈ ప్రాంత బిడ్డలు చదువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారని, కానీ నేడు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు కొడంగల్‌కు వచ్చేలా విద్యా సంస్థలను తీర్చిదిద్దుతామన్నారు. దీనికి తోడు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ లగచర్లలో 430 పడకల అత్యాధునిక ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం స్థానికంగానే అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### సాగునీటి కల సాకారం..
### కృష్ణమ్మ జలాలతో పచ్చని పొలాలు

కొడంగల్ మెట్ట భూములను సస్యశ్యామలం చేయడమే తన ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని, నిధుల కొరత లేదని భరోసా ఇచ్చారు. కృష్ణా నదీ జలాలతో ఈ ప్రాంత భూములు తడిసే వరకు విశ్రమించేది లేదని, ఈ ప్రాజెక్టును ఏడాదిన్నరలోపే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పనులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరిలను సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, వికారాబాద్ కృష్ణా రైల్వే లైన్ పనులను వేగవంతం చేస్తామని, రేకులపాడు ప్రాంతంలో రానున్న ఆరు నెలల్లో సిమెంట్ పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని విప్లవాత్మక ప్రకటనలు చేశారు.

### రాజకీయాలు పక్కన పెడదాం..
### 2034 దాకా కేవలం అభివృద్ధి!

కొడంగల్ అభివృద్ధి కోసం రాజకీయ విభేదాలను విడనాడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టి, కేవలం అభివృద్ధి మంత్రంతో ముందుకు సాగాలని నాయకులకు సూచించారు. కోస్గి నుంచి శంషాబాద్ వరకు 300 అడుగుల రోడ్డును నిర్మిస్తున్నామని, దీని ద్వారా ఈ ప్రాంత ముఖచిత్రం పూర్తిగా మారుతుందని తెలిపారు. పేదల సమస్యలను పరిష్కరించేందుకు మండలానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఏ గ్రామంలో ఏ పని కావాలో తన దృష్టికి తీసుకురావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

# కేరళ సీఎంగా కేసీ వేణుగోపాల్?

- 47మంది ఎమ్మెల్యేల మొగ్గు అటే
- అభిప్రాయసేకరణలో సతీషన్ వైపు 6, రమేష్ కు 8మంది మద్దతు
- హైకమాండ్ కోర్టులో బంతి.. సతీషన్ కు మద్దతుగా మిత్రపక్షాలు
- నేడో రేపో ఉత్కంఠకు తెర



**తిరువనంతపురం, మహా:** కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియ ఉత్కంఠభరితంగా సాగుతోంది. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌కు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. గురువారం ఏఐసీసీ పరిశీలకులతో జరిగిన ముఖాముఖి భేటీలో, కాంగ్రెస్‌కు ఉన్న 63 మంది ఎమ్మెల్యేలలో 47 మంది వేణుగోపాల్ పేరును ప్రతిపాదించడం విశేషం. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ సాధించిన అద్భుత విజయం తర్వాత, ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే అంశంపైనే కేంద్రీకృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ తరపున గెలిచిన 63 మంది ఎమ్మెల్యేలలో అత్యధికులు వేణుగోపాల్ నాయకత్వాన్ని కోరుకుంటుండడంతో రాజకీయం ఆసక్తిగా మారింది. తిరువనంతపురంలో ఏఐసీసీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ ఆధ్వర్యంలో జరిగిన సీఎల్పీ సమావేశం అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ఎమ్మెల్యేల నుంచి విడివిడిగా అభిప్రాయాలను సేకరించిన పరిశీలకులకు, 47 మందికి పైగా సభ్యులు కేసీ వేణుగోపాల్‌కే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు కావడంతో పాటు, జాతీయ స్థాయిలో పార్టీని నడిపించడంలో ఆయనకున్న అనుభవం రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచిగా మారుతుందని ఎమ్మెల్యేలు బలంగా విశ్వసిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎంపికపై తుది నిర్ణయం తీసుకునే అధికారాన్ని కాంగ్రెస్ శాసనసభాపక్షం ఏకగ్రీవంగా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అప్పగించింది. పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ తమ నివేదికను హైకమాండ్‌కు సమర్పించనున్నారు. వేణుగోపాల్ స్వయంగా ఈ రేసులో ఉండటంతో, తుది నిర్ణయంలో రాహుల్ గాంధీ పాత్ర కీలకం కానుంది.

### మద్దతు ఎవరికి ఎంత?

కేరళ పీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ సహా సందీప్ వారియర్, సజీవ్ జోసెఫ్ వంటి కీలక నేతలు వేణుగోపాల్ వైపు మొగ్గు చూపారు. కేసీ వేణుగోపాల్ కు 47 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. రమేష్ చెన్నితాల: మాజీ ప్రతిపక్ష నేత రమేష్‌కు కేవలం 8 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మద్దతు పలికారు. ఆయన అత్యంత సన్నిహితుడు ఐ.సి. బాలకృష్ణన్ కూడా వేణుగోపాల్‌కు మద్దతు తెలపడం రమేష్‌కు షాక్ ఇచ్చింది. వి.డి. సతీశన్: ప్రస్తుత ప్రతిపక్ష నేత సతీశన్‌కు 6 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించింది. అయితే, కూటమిలోని ఇతర పార్టీల మద్దతు ఆయనకు ఎక్కువగా ఉంది.

### నేడో రేపో ఫైనల్

ముస్లిం లీగ్ మరియు కేరళ కాంగ్రెస్ (జోసెఫ్) వంటి మిత్రపక్షాలు వి.డి. సతీశన్ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ప్రజల్లో సతీశన్‌కు ఉన్న ఆదరణను పరిగణనలోకి తీసుకోవాలని పీజే జోసెఫ్ కోరారు. మరోవైపు, రమేష్ చెన్నితాల మాట్లాడుతూ.. తనకు ఇదే చివరి అవకాశమని, తన సీనియారిటీని గుర్తించాలని పరిశీలకులను కోరారు. శనివారం లేదా ఆదివారం నాటికి హైకమాండ్ ముఖ్యమంత్రి పేరును ప్రకటించే అవకాశం ఉంది. ప్రకటన వచ్చిన రెండు రోజుల్లోనే కొత్త ముఖ్యమంత్రితో పాటు మంత్రుల ప్రమాణ స్వీకారం ఉండవచ్చు. కేరళలో కాంగ్రెస్ పార్టీ సీట్ల సంఖ్య 21 నుండి 63 కి పెరగడంతో, అందరినీ కలుపుకుని పోయే నాయకుడి కోసం అధిష్టానం కసరత్తు చేస్తోంది.

# తెలంగాణకు జలద్రోహం చేస్తే బొంద పెడుతాం



(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆమె సభను ఉద్దేశించి మాట్లాడుతూ... పాలమూరుకు పట్టిన శని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే అని, ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులను నిందించి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, పదేళ్ల పాలనలో తెలంగాణ రైతుల గొంతు కోసిందని ఆమె ధ్వజమెత్తారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరుతో రూ. 33 వేల కోట్లు ఖర్చు చేసిన గత ప్రభుత్వం, కనీసం 33 ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కేవలం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, కమిషన్ల కోసమే ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో జూరాల సోర్స్ పాయింట్‌ను శ్రీశైలంకు మార్చారని, దీనివల్లే నేడు ఆంధ్రాతో నిత్యం నీటి పంచాయితీలు వస్తున్నాయని ఆమె దుయ్యబట్టారు.

### సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటు విమర్శలు

నల్లమల పులి బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన సొంత ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె ప్రశ్నించారు. పాలమూరు ప్రజలు కాంగ్రెస్‌కు 12 సీట్లు కట్టబెడితే, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని విమర్శించారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్ల కక్కుర్తిలో పడి ప్రజలను మోసం చేస్తున్నారని, ఈ పాపంలో వారందరికీ భాగస్వామ్యం ఉందని ఆరోపించారు.

### దసరా గడువు - పాదయాత్ర అల్టిమేటం

ప్రభుత్వానికి స్పష్టమైన అల్టిమేటం జారీ చేస్తూ రాబోయే దసరా పండుగ నాటికి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ పనులను ప్రారంభించాలని, లేని పక్షంలో దసరా మరుసటి రోజు నుంచే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ భారీ పాదయాత్ర చేపడతామని ఆమె సవాల్ విసిరారు. తెలంగాణలో నీటి అన్యాయాన్ని సరిచేయడమే లక్ష్యంగా తమ పార్టీ పుట్టిందని ఆమె స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్ పార్టీది క్షమించలేని దుస్థితి

పదేళ్లు పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీ ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని ఆమె ఏద్దేవా చేశారు. ఆ పార్టీలో ఓ గుంట నక్క ఉందని, గతంలో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అటు పార్టీని, ఇటు రాష్ట్ర ప్రజలను మోసం చేశారాని విమర్శించారు. శ్రీశైలంలో 140 మీటర్ల నుంచి తీసుకోవాల్సిన నీటిని 50 మీటర్లకు కుదించి ఉమ్మడి పాలమూరుప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని అప్పటి మంత్రిపై ఆమె నిప్పులు చెరిగారు. పదేళ్లలో బిఆర్ఎస్, రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నుంచి తట్టెడు మట్టి కూడా తీయలేకపోయారని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి లక్షల ఎకరాలకు నీటిని అందజేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

### తెలంగాణ రక్షణ సేన భవిష్యత్తు ప్రణాళిక

తమ పార్టీ అధికారంలోకి వస్తే సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇరిగేషన్, వాటర్ మేనేజ్ మెంట్ పర్యవేక్షణకు ప్రత్యేక వాటర్ కమిషన్' ఏర్పాటు చేస్తామన్నారు. చెరువుల నుంచి నీరు నేరుగా రైతుల పొలాలకు వెళ్లేలా పర్యవేక్షించేందుకు ప్రతి 3000 ఎకరాలకు ఒక లష్కర్లను నియమిస్తాం అన్నారు. అత్యంత ఎత్తైన ప్రాంతమైన లక్ష్మీదేవి పల్లిలో రిజర్వాయర్ నిర్మించి, రంగారెడ్డికి 4 లక్షలు, మహబూబ్ నగర్ కు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

### బీజేపీ తీరుపై ఆగ్రహం..
### మోడీకి డిమాండ్లు

పాలమూరుకు జాతీయ హోదా విషయంలో బీజేపీ కూడా తెలంగాణను మోసం చేస్తోందని ఆమె విమర్శించారు. ఈ నెల 10న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోడీని స్థానిక ఎంపీ అరుణమ్మ కలిసి, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదాతో పాటు, జనగణనలో బీసీ కాలమ్, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేయాలన్నారు. తెలంగాణ రక్షణ సేన చేపట్టిన ఈ నీటి ఉద్యమానికి రైతులు, యువత, మేధావులు మద్దతు తెలపాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సభలో పార్టీ ముఖ్య నాయకులు సేనాపతి, వరలక్ష్మి, ముస్తఫా, చీమల రమేష్, పాండురంగారెడ్డి, బాలాజీ ఉదయ్, రూప్ సింగ్ నాయక్, రంజిత్ కుమార్, శ్రీనివాస్, సైదులు యాదవ్, మల్కాజ్గిరి వెంకట్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా, 20 నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



# బెంగాల్ సీఎం సువేందు అధికారి

## ప్రకటించిన అమిత్ షా.. నేడు ప్రమాణం.. ఈ విజయం అసాధరణం

**మహా:** పశ్చిమ బెంగాల్ రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో శుక్రవారం జరిగిన బీజేపీ నూతన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా... బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను 207 సీట్లు గెలుచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహ పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలుపొందారు. ముఖ్యంగా భవానీపూర్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం ఆయనకు కలిసొచ్చింది. కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. సువేందు అధికారి ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

**ఈ విజయం అసాధరణం - అమిత్ షా**

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తమ పార్టీ నాయకుడు సువేందు అధికారి ఆమె సొంత నియోజకవర్గంలో ఓడించారని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, బెంగాల్ ఐదు దశాబ్దాల పాటు ప్రజాస్వామ్య క్షీణత, శాంతిభద్రతల పతనంతో తీవ్ర సమస్యను ఎదుర్కొందని అన్నారు. ఇప్పుడు టీఎంసీ ఓటమితో రాష్ట్రంలో అరాచక పాలన ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు. బీజేపీ బెంగాల్‌లో అద్భుత విజయం సాధించిందని అమిత్ షా అన్నారు. ఈ విజయం అసాధారణమని, బెంగాల్ చరిత్రలోనే కీలక మలుపు అన్నారు. ప్రచారం సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఇప్పుడు బీజేపీ పైనే ఉందని స్పష్టం చేశారు. బెంగాల్ అభివృద్ధి బాధ్యత తమపైనే ఉందని అన్నారు.

# ప్రేమ 'శిక్ష'... కత్తుల వేట!

(మొదటిపేజీ తరువాయి)

అయితే, కసితో రగిలిపోతున్న నిందితులు అతడిని వదలకుండా వెంటాడారు. జనం చూస్తుండగానే నడిరోడ్డుపై యవన్‌ను పట్టుకుని, కత్తులతో విచక్షణా రహితంగా పొడిచారు. ఈ దాడిలో యవన్ శరీరంలో 17 చోట్ల లోతైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతూ యవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘాతుకానికి పాల్పడిన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. రద్దీగా ఉండే రోడ్డుపై జరిగిన ఈ దారుణ హత్యను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రేమించిన యువతి బంధువులే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఒక మేధావిగా ఎదగాల్సిన విద్యార్థి, ఇలా ప్రేమ పేరుతో జరిగిన గొడవల్లో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది

# విజయ్‌కు మళ్లీ బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో రాజ్‌భవన్ అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శిస్తోంది. మ్యాజిక్ ఫిగర్ పక్కాగా దాటే వరకు, దానికి సంబంధించిన లేఖలు అందే వరకు ప్రమాణ స్వీకారానికి అనుమతి ఇచ్చేది లేదని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా సాగుతున్న ప్రమాణ స్వీకార ఉత్సవ ఏర్పాట్లకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. గవర్నర్ నుంచి స్పష్టమైన ఆహ్వానం అందకపోవడంతో అధికార యంత్రాంగంలోనూ గందరగోళం నెలకొంది.

### రాత్రికి రాత్రే జరగనున్న మంత్రాంగాలు

మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం ఒక్క స్థానం మాత్రమే తక్కువ కావడంతో రాత్రికి రాత్రే రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల నేతలు మద్దతు లేఖలు ఎందుకు పంపలేదన్న దానిపై విజయ్ స్వయంగా వారితో మంతనాలు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు, స్వతంత్ర అభ్యర్థులు లేదా ఇతర చిన్న పార్టీల ఎమ్మెల్యేలను కలుపుకునేందుకు కూడా టీవీకే వ్యూహకర్తలు పావులు కదుపుతున్నారు. ఎలాగైనా ఆ ఒక్క అంకెను దాటి, అనుకున్న ముహూర్తానికే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేలా ఆ పార్టీ శ్రేణులు శతవిధాలా శ్రమిస్తున్నాయి. ఏ క్షణంలో ఎలాంటి సంచలన వార్త వెలువడుతుందోనని యావత్ తమిళనాడు అత్యంత ఆసక్తిగా గమనిస్తోంది.

### మ్యాజిక్ ఫిగర్‌కు
### చేరువలో నిలిచిపోయిన బలం

తాజా రాజకీయ సమీకరణాల నేపథ్యంలో టీవీకే కూటమి సంఖ్యాబలం 116 వద్దే నిలిచిపోయింది. తమిళనాడు శాసనసభలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కనీసం 117 మంది శాసనసభ్యుల మద్దతు అత్యవసరం. ఒకే ఒక్క అడుగు దూరంలో మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేక టీవీకే కూటమి చతికిలపడటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఒక్క స్థానం లోటు ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు అతిపెద్ద అవరోధంగా మారింది. మిగిలిన పార్టీల నుంచి మద్దతు కూడగట్టేందుకు, లేదా ఆ రెండు పార్టీల నుంచి ఆశించిన లేఖలను సత్వరమే రాజ్‌భవన్‌కు చేర్చేందుకు విజయ్ శిబిరం ప్రయత్నాలు ప్రారంభించింది.

### గవర్నర్ గ్రీన్ సిగ్నల్ కరువు.. నిలిచిన ఏర్పాట్లు

రాజ్యాంగ నిబంధనల ప్రకారం స్పష్టమైన మెజారిటీ ఉన్న కూటమి లేదా పార్టీకి మాత్రమే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం దక్కుతుంది. ఈ నేపథ్యంలో రాజ్‌భవన్ అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శిస్తోంది. మ్యాజిక్ ఫిగర్ పక్కాగా దాటే వరకు, దానికి సంబంధించిన లేఖలు అందే వరకు ప్రమాణ స్వీకారానికి అనుమతి ఇచ్చేది లేదని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా సాగుతున్న ప్రమాణ స్వీకార ఉత్సవ ఏర్పాట్లకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. గవర్నర్ నుంచి స్పష్టమైన ఆహ్వానం అందకపోవడంతో అధికార యంత్రాంగంలోనూ గందరగోళం నెలకొంది.

### రాత్రికి రాత్రే జరగనున్న మంత్రాంగాలు

మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం ఒక్క స్థానం మాత్రమే తక్కువ కావడంతో రాత్రికి రాత్రే రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల నేతలు మద్దతు లేఖలు ఎందుకు పంపలేదన్న దానిపై విజయ్ స్వయంగా వారితో మంతనాలు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు, స్వతంత్ర అభ్యర్థులు లేదా ఇతర చిన్న పార్టీల ఎమ్మెల్యేలను కలుపుకునేందుకు కూడా టీవీకే వ్యూహకర్తలు పావులు కదుపుతున్నారు. ఎలాగైనా ఆ ఒక్క అంకెను దాటి, అనుకున్న ముహూర్తానికే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేలా ఆ పార్టీ శ్రేణులు శతవిధాలా శ్రమిస్తున్నాయి. ఏ క్షణంలో ఎలాంటి సంచలన వార్త వెలువడుతుందోనని యావత్ తమిళనాడు అత్యంత ఆసక్తిగా గమనిస్తోంది.

# ఇక రాయల్ సీమ

## తిరుపతికి భారీ పెట్టుబడులు

## రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ఏపీ సీఎం చంద్రబాబు ఆసక్తికర ట్వీట్

**అమరావతి, మహా:** రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తాజాగా చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడూ కరువు కాటకాలతో, వెనుకబాటుతనంతో సతమతమయ్యే రాయలసీమ రూపురేఖలు ఇక పూర్తిగా మారిపోనున్నాయని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించే దిశగా అడుగులు పడుతున్నాయని సూచిస్తూ, "ఇది రాయలసీమ కాదు.. ఇక రాయల్ సీమ" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పారిశ్రామిక, రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సీమ దశ, దిశ మార్చేలా వస్తున్న సరికొత్త పెట్టుబడుల నేపథ్యమే సీఎం ఉత్సాహభరిత పోస్టుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆధ్యాత్మిక నగరి తిరుపతి కేంద్రంగా భారీ పారిశ్రామిక విప్లవానికి నాంది పడుతోంది. ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ అయిన 'రాయల్ ఎన్‌ఫీల్డ్' తిరుపతిలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు సన్నద్ధమైంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా ఆటోమొబైల్ రంగంలో తిరుపతి జాతీయ స్థాయిలోనే ఓ కీలక హబ్‌గా రూపాంతరం చెందబోతోంది. ఈ శుభ పరిణామాన్ని ఉద్దేశించే సీఎం చంద్రబాబు.. రాయలసీమకు ఇక ఆ 'రాయల్' కళ వస్తోందంటూ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకతో కేవలం ఒక భారీ పరిశ్రమ రావడం మాత్రమే కాకుండా, దాని అనుబంధ సంస్థలు కూడా క్యూ కడతాయని, తద్వారా ఈ ప్రాంతంలో వేలాది మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. గతంలో ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ఉమ్మడి రాష్ట్రంలో తనదైన మార్క్ చూపించిన చంద్రబాబు.. ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్‌ను, ముఖ్యంగా రాయలసీమను అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు కంకణం కట్టుకున్నట్లు ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాల వల్లే రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంటి దిగ్గజ సంస్థలు ఏపీ వైపు చూస్తున్నాయని పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఏదేమైనా.. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన సీమ ప్రాంతం, భవిష్యత్తులో నూతన పెట్టుబడులతో "రాయల్ సీమ"గా దేదీప్యమానంగా వెలుగొందడం ఖాయమన్న భరోసా తాజా పరిణామాలతో ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది.

# తెలంగాణలో విద్యావిప్లవానికి ఆరుట్లలో శ్రీకారం

- అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ....
- వచ్చే నెల 15న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు....
- రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి....
- ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ లు...
- అధునాతన హంగుల ప్రభుత్వ బడిని చూసి హర్షం...
- విప్ లను సన్మానించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఒక బడి మాత్రమే కాదు.... తెలంగాణ విద్యా వ్యవస్థలో రాబోయే విప్లవాత్మక మార్పులకు ఒక ప్రయోగశాలగా ప్రభుత్వ విప్ లు అభివర్ణించారు. ఇక్కడి ప్రతీ సౌకర్యం ఇంటర్నేషనల్ స్కూల్ కు ధీటుగా ఉండటం విద్యావ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణ రావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, రామచందర్ నాయక్ , అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ సందర్శించారు. శుక్రవారం ఉదయం ఆరుట్ల గ్రామానికి చేరుకున్న వీరికి స్వాగతం పలికిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణం, సౌకర్యాలు, పనితీరు గురించి రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి వారికి వివరించారు. ఇంటిగ్రేటెడ్ విద్యా వ్యవస్థ, అధునాతన తరగతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడామైదానం, జిమ్, భోజన సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను ఆకునూరి మురళి, ఎమ్మెల్యే మల్ రెడ్డి వివరించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్ని తలదన్నేలా ప్రభుత్వం నిర్మిస్తున్న పాఠశాలను చూసి ప్రభుత్వ విప్ లు హర్షం వ్యక్తం చేశారు. ఇదే తీరుగా రాష్ట్రంలో 100 చోట్ల తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకోసం ఆరుట్ల పాఠశాలను నమూనాగా తీసుకోనున్నట్లు తెలిపారు. భావిభారతం అభివృద్ధిపథంలో సాగాలంటే విద్య అతిముఖ్యమని... అందుకోసమే విద్యావ్యవస్థను బాగుచేసి, దేశభవిష్యత్తుకు ప్రభుత్వం బంగారుబాటలు వేస్తుందని చెప్పారు.

**ఇబ్రహీంపట్నం ప్రజల అదృష్టంగా భావిస్తున్నా: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...**

రాష్ట్ర విద్యావిప్లవానికి తమ నియోజకవర్గం నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఇబ్రహీంపట్నం ప్రజల అదృష్టంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి మార్గదర్శకంగా అత్యున్నత ప్రమాణాలతో ఈ పబ్లిక్ స్కూల్ పూర్తైందని చెప్పారు. విద్యావైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని.... ఈ సారి బడ్జెట్ లో రూ.26వేల కోట్లకు పైగా విద్యకు కేటాయింపులు చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. పేదలందరికీ ఉచితంగా ఉన్నత ప్రమాణాలతో విద్యనందించిన నైపుణ్యం గల యువతను దేశానికి అందించటమే లక్ష్యంగా పనిచేస్తోందని... ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు పాండురంగారెడ్డి, హనుమంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, స్థానిక సర్పంచ్ మానుపాటి శోభాకుమార్ హెచ్ఎం గిరిధర్ గౌడ్ నాయకులు సాతిరి ఎల్లేష్, గుడిమల్ల చంద్రయ్య, మాసయ్య, గౌడ్ మార సురేష్, ఏ భరత్ రెడ్డి, కావలి శ్రీనివాస్, బైరీక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పలువురు నాయకులు కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బండి ప్రభాకర్ యాదవ్ నియామకం



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బండి ప్రభాకర్ యాదవ్ లో నియమిస్తూ రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ను పటిష్టం చేసేందుకు శాయ శక్తులా అంకితభావంతో కృషి చేస్తానని అదేవిధంగా బెల్లంపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేసే దిశలో భాగస్వామిని అవుతానని వెల్లడించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర నాయకత్వంతో పాటు జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు వారోత్సవాలు



**మొయినాబాద్ మహా:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో రైతు వారోత్సవాలలో భాగంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పెద్దమంగళారం లోని పశువైద్య ఉపకేంద్రం లో పశువుల గర్భకోశ వ్యాధి మరియు పశు ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మొయినాబాద్ మునిసిపల్ ఛైర్పర్సన్ సోనియా దర్శన్ ప్రారంభించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో 56 పశువులకు చికిత్స , 30 దూడలకు నట్టల మందు తాగించడం, 21 గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశుగ్రాస విత్తనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మొయినాబాద్ మునిసిపల్ ఛైర్పర్సన్ సోనియా దర్శన్, కౌన్సిలర్లుమమత గీతవన జక్షి, అగ్రికల్చర్ ఆఫీసర్ అనురాధ ఏఈఓ సునీల్ మరియు కుమార్ ,మరియు పశువైద్య సిబ్బంది పద్మ విఎల్ఓ, కుమార్ ఎల్ఎస్ఏ, గోరేమియా, రవీందర్ , గోపాలమిత్రలు యాదయ్య శ్రీనివాసులు మరియు గ్రామ పెద్దలు, పాడి రైతులు, గొర్రెల కాపరులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

## దొంగతనాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

- బంగారు ఆభరణాల వ్యాపారులు,గోల్డ్ లోన్ సంస్థల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- మీ గృహ పరిసర ప్రాంతాలలో అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి
- బెల్లంపల్లి ఏసీపీ కిరణ్కుమార్




**మందమర్రి, మహా :** దొంగతనాల నియంత్రణకు ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్కుమార్, మందమర్రి సీఐ పర్స రమేష్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం మందమర్రి ఏరియా సింగరేణి ఇల్లందు క్లబ్ లో బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బ్యాంకులు, ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్ సంస్థలు, గోల్డ్ షాపులు,లాడ్జిల మేనేజర్లు, యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మన పరిధిలో పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ చెదురు మదురుగా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. నేరాల నివారణకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొంతమంది నేరస్తులకు లాడ్జిల్లో గదులు కేటాయించే సమయంలో,వారి ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఫోన్ నంబర్లను పరిశీలించిన తర్వాతనే గదులు ఇవ్వాలని సూచించారు. మీ గృహ పరిసర ప్రాంతాలలో అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా ఇటీవల వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, దొంగలు బంగారాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. బ్యాంకులు, ప్రైవేట్ గోల్డ్ లోన్ సంస్థలు,ఆభరణాల వ్యాపారులు తమ భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాపార సముదాయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని అన్నారు. ఫైర్ సైరన్లను కూడా ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. గన్ లైసెన్స్ కలిగిన వ్యక్తులను భద్రతా సిబ్బందిగా నియమిస్తే పూర్తి స్థాయి భద్రత కల్పించవచ్చని తెలిపారు. నేర సంఘటనలు జరిగిన తర్వాత ఫిర్యాదు చేయడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రాంతాన్ని నేరరహితంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్, బెల్లంపల్లి వన్టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు,బెల్లంపల్లి ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



**సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, మహా :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని శంషాబాద్ సర్కిల్ 18 లో అభివృద్ధి పనులను శుక్రవారంఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూస్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించే దిశగా కృషి చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ, ఎస్సీ కిష్టప్ప, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు, పార్టీ నాయకులు ఆర్ గణేష్ గుప్తా, వెంకటేష్ గౌడ్, గోపాల్ యాదవ్ , తదితరులు పాల్గొన్నారు

## సర్పంచుల ఐక్యతతో గ్రామాభివృద్ధికి కృషి

- బూర్గంపాడు మండల సర్పంచుల సంఘానికి కొత్త కమిటీ
- ఏకగ్రీవంగా అధ్యక్షుడైన మందా నాగరాజు
- సారపాకలో ఘనంగా నిర్వహించిన ఎన్నికల సమావేశం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండల సర్పంచుల సంఘం కమిటీ ఎన్నికలు శుక్రవారం సారపాకలో నిర్వహించబడ్డాయి. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు హాజరై సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బూర్గంపాడు గ్రామ సర్పంచ్ మందా నాగరాజును మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నుంచే ఆయన బాధ్యతలు స్వీకరించినట్లు సమావేశంలో ప్రకటించారు. అదేవిధంగా సంఘం ఉపాధ్యక్షులుగా తాటి వాణి, బానోతు పద్మ, గుమ్మడి కృష్ణవేణి, శర్ప నాగమణి, వర్కింగ్ ప్రెసిడెంట్గా పూనం సురేందర్, కోశాధికారిగా కుంజా కొండమ్మ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మందా నాగరాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి సంఘం వేదికగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుండి బాబురావు, బానోతు సరోజ, బొర్రా సుభద్ర, పోతునూరు సూరమ్మ, బొల్లి నిరోషా, బొల్లా సైదమ్మ, తాటి లక్ష్మి, బానోతు నరసింహ, వర్ష మంగమ్మ, రైతులు పాల్గొన్నారు.


## బూర్గంపాడులో తెలంగాణ జన సమితి నాలుగోవ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ

**అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా కార్యక్రమం నిర్వహణ**



**బూర్గంపహాడ్ మహా :** తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీ నాల్గో ప్లీనరీ సమావేశానికి సంబంధించిన పోస్టర్ను శుక్రవారం బూర్గంపాడు సెంటర్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దశాబ్దాల పాటు సాగిన ప్రజా పోరాటాలు, అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందన్నారు. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. రాజ్యాంగ విలువలకు విఘాతం కలిగిస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచి రాష్ట్రాన్ని ఒక కుటుంబ జాగీర్లా మార్చారని ఆరోపించారు.ప్రజాస్వామ్య విలువలను పక్కనపెట్టి, డబ్బు మరియు అధికార రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చారని, ప్రశ్నించే స్వరాలను అణిచివేస్తూ నిరంకుశ పాలన కొనసాగించారని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం మారాల్సింది కేవలం పాలకులు మాత్రమే కాదని, రాజకీయ విధానాలు మరియు పాలనా పద్ధతులూ మారాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజల భాగస్వామ్యంతో, పారదర్శకతతో కూడిన ప్రజాస్వామ్య రాజకీయాలు రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. ఎన్నికలను ఆర్థిక బల ప్రదర్శనగా కాకుండా రాజ్యాంగ విలువలను పరిరక్షించే వేదికగా మార్చాలని తెలంగాణ జన సమితి లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ రథసారథి ఆచార్య కోదండరాం నాయకత్వంలో 2018 ఏప్రిల్ 29న తెలంగాణ జన సమితి పార్టీ ఆవిర్భవించిందని గుర్తు చేశారు.అంతేకాక ప్రజలందరికీ ఆర్థిక వ్యవస్థలో సమాన భాగస్వామ్యం కల్పించే విధానాలు అమలు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుడ్డి వీర రాఘవులు, సురకంటి ప్రభాకర్ రెడ్డి, సుందర్ రావు, నాగమ్మ వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



**మందమర్రి, మహా :** మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పలువురికి చెన్నూరు ఎమ్మెల్యే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా అధికారులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ చెప్పుల పంపిణీలో దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ సతీష్ కుమార్, డిసిసి సభ్యులు రఘునాథ్ రెడ్డి, బండి సదానందం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పథంలో బాకారం

**సర్పంచ్ వెంకటేష్ గౌడ్**

**మొయినాబాద్ మహా:** గ్రామాన్ని అన్ని విధాలుగా దిశలవారీగా అభివృద్ధి చేస్తానని బాకారం సర్పంచ్ వెంకటేష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం బాకారం జాగీర్ గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి మరియు వార్డు సభ్యుల తో కలిసి హనుమాన్ దేవాలయం నుండి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గింజ కొనని ధాన్యం కొనుగోలు కేంద్రం

**అధికారుల తీరుపై ఆగ్రహిస్తున్న రైతులు**

**వాతావరణ మార్పులతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు**

**రాత్రి, పగలు రాశుల వద్దే నిరీక్షణ**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జూలూరుపాడు వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం లో నేటికీ గింజ కూడా కొనుగోలు చేయలేదని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన 15 రోజుల వ్యవధిలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వందల బస్తాల వరి ధాన్యాన్ని కేంద్రానికి తరలించడం జరిగింది. ధాన్యం కేంద్రానికి చేరి పది రోజులు కావస్తున్న తమని పట్టించుకునే నాథుడే లేడని అన్నదాతలు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వాతావరణ శాఖ హెచ్చరికలు, జరుగుతున్న వాతావరణ మార్పులతో భయాందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి చేతికందిన పంట నీళ్ల పాలవుతుందేమోనని బిక్కుబిక్కుమంటు దిక్కులు చూస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో గత పది రోజులుగా రాశుల వద్ద చీకటిలో పాములు, తేళ్ల నడుమ కంటిమీద కునుకు లేకుండా పంట రాశులకు కావలి కాస్తున్నామని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. లేని పక్షంలో రైతు కుటుంబాలన్నీ ఏకమై భారీ ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

## 6 గ్యారంటీలు అమలు చేయాలి

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అమలు చేయాలి
- రెండు ఫోటోలు తీయటం రద్దు చేయాలని పాత పద్ధతిలోనే ఉపాధి పనిని చూపించాలని డిమాండ్



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం ఉప్పు సాక ఎస్సీ కాలనీ ఉపాధి కార్మికుల పని ప్రాంతాన్ని పర్యటించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికి అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఆత్మీయ భరోసా 12000 ఇవ్వాలని అన్నారు, ఇల్లు స్థలం ఉన్న వారికి ఇల్లు ఇవ్వాలని స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇంద్రమ్మ ఇల్లు నిర్మించాలని, ఉపాధి కార్మికులకి జాబ్ కార్డు ఉన్నవారికి భూమి లేని వారికి 12000 ఇవ్వాలని వృద్ధాప్య పింఛన్ కొత్త వాళ్లకి ఇవ్వాలని పాత పించన్లతో పాటు నాలుగు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికులు పని ప్రదేశంలో ఎటువంటి సహకారాలు లేవని రెండు ఫోటోలు పేరుతో కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్నం 1:00 దాకా ఎర్రటి ఎండల్లో ఉపాధి కార్మికులని బలి పశువుల్ని చేస్తున్నారని కళ్ళు పూర్తిగా సెల్లు కెమెరాలు కనపడలని అట్ల కనపడని వాళ్లని పని లేదు ఇంటికి వెళ్ళిపోవచ్చు అని చెబుతున్న అధికారులు అట్లా రోజురోజుకీ ఉపాధి పనికి దూరమవుతున్న ఉపాధి కార్మికులు కేంద్ర ప్రభుత్వం 60% నిధులు ఇస్తాము 40% రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టాలని కానీ బడ్జెట్లో కేటాయించక పోవడం 40% ఇప్పుడు ఏప్రిల్ మే లో చేసిన పనికి డబ్బులు వస్తాయా రావా అని ఆలోచన కూడా ఆందోళనలో ఉపాధి కార్మికులు ఉన్నారని, అందుకు ఈ పనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధి కార్మికులపైనే ఉందని తెలిపారు, ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్ని అమలు చేయాలని మే 13న బూర్గంపాడు తాసిల్దార్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున సమస్యల పైన ధర్నా ఉందని దీనికి బూర్గంపాడు మండలంలో ఉన్న ప్రతి ఉపాధి కార్మికులు రావాలని కోరారు ఉపాధిని కాపాడుకుందాం పాత పద్ధతిలోనే పనిని చేపించాలని అంతేకాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇంత మట్టికి వారి వేతనాలు ఇవ్వకపోవడం దానివల్ల వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల వల్ల సతమతం అవుతున్నారని వెంటనే వారి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రెంటాల సుజాత శాంత బక్కయ్య డి నాగరాజు తిరుపతయ్య సునీత రెంటాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణనతో జన గణన సులభతరం అవుతుంది

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** జనగణన 2027 లో భాగంగా స్వీయ గణనతో కార్యక్రమం సులభతరం అవుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా ఐ. బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు చేపట్టిన మారథాన్ వాక్ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడాసేవల అధికారి హనుమంత రెడ్డి, జిల్లా ఉప గణాంక అధికారి రాజేందర్ ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వీయ గణనపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు మారథాన్ వాక్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరికీ తెలిసేలా ప్లకార్డులు ప్రదర్శించడంతో పాటు ప్రజలను స్వీయ గణనలో భాగస్వాములు కావాలని కోరుతూ నినాదాలు చేయడం జరిగిందని తెలిపారు. మన వివరాలు మనమే నమోదు చేద్దామని, స్వీయ గణనతో జనగణన సులభతరం అవుతుందని, జన గణన విజయవంతం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఖచ్చితమైన జనాభా గణాంకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రజలు స్వీయ గణన సదుపాయాన్ని వినియోగించుకుని ఈ నెల 10 లోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వీయ గణన పూర్తి చేసి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ద్వారా స్వీయ గణనపై పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.




**అవినీతి ఆరోపణల నేపథ్యంలో... ఎమ్మార్వో కార్యాలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు..**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఉన్నత అధికారులు ఆదేశాల అనుసారం జిల్లా ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ బృందం శుక్రవారం శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం రెండు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తలుపులు మూసి సంబంధిత పత్రాలను తనిఖీలు చేసినట్టు సమాచారం.శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయం పై ఎన్నో అవినీతిఆరోపణలు రావడంతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని రంగారెడ్డి జిల్లా అవినీతి నిరోధక శాఖ డిఎస్పి ఆనంద్ కుమార్ తెలిపారు.అవినీతి ఆరోపణలపై పూర్తిగా విచారణ జరిగిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు. పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది.

### మణుగూరు పిహెచ్ సి ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా దినోత్సవ కార్యక్రమం..



**మణుగూరు, మహా :** ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తలసేమియా అనే జన్యుపరమైన రక్త వ్యాధి గురించి ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. తలసేమియా వల్ల రక్తహీనత, శారీరక బలహీనత, ఎదుగుదల లోపాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. వివాహానికి ముందు రక్త పరీక్షలు చేయించుకోవడం, జన్యు సలహాలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే తలసేమియా బాధితులకు తరచుగా రక్త మార్పిడి అవసరం అవుతుందని, అందువల్ల రక్తదానం చేయడం ఎంతో గొప్ప సేవ కార్యక్రమమని అన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



**నర్సాపురంలో పశుసంవర్ధక చికిత్స**

## అవగాహన శిబిరం

**పశువుల పెంపకంలో జాగ్రత్తల గురించి వివరించిన డాక్టర్ సాయిరాం సందీప్**

**జూలూరుపాడు, మహా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధి పడమట నర్సాపురం గ్రామంలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ జూలూరుపాడు వారి ఆధ్వర్యంలో శుక్రవారం పశు సంవర్ధక చికిత్స అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువుల సంతానోత్పత్తి, మేలు జాతి దూడల ప్రదర్శన, మేలు జాతి పశుగ్రాస గింజల విస్తరణ, వేసవికాలంలో పశువుల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పశు పెంపకదారులకు, గ్రామ ప్రజలకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాయిరాం సందీప్ వివరించారు. అదేవిధంగా పశువులను పరీక్షించి చికిత్స చేసి, కావలసిన మందులను పంపిణీ చేశారు. గ్రామంలోని పశువుల పెంపకదారులంతా మూగజీవాల కదలికలను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, అవసరమైన వైద్య సేవలను ఉచితంగా ప్రభుత్వ పశువైద్యశాలలలో పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మి కుమారి, చిన్నరాజు, గోపాలమిత్రలు, పశు వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి




**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ చదువుతున్న 2, 4, 6 సెమిస్టర్ల విద్యార్థిని విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 19వ తేదీలోపు చెల్లించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. ఏకాంబరం తెలిపారు. 500 రూపాయల అపరాధ రుసుముతో ఈ నెల 23వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సెమిస్టర్లకు సంబంధించిన పరీక్షలు జూన్, జూలై నెలల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫీజు కట్టని వారు మరియు పరీక్షలు రాయని వారు కూడా రెండవ సెమిస్టర్ కు సంబంధించిన ఫీజు కట్టుకోవచ్చని పేర్కొన్నారు. కావున విద్యార్థులు పై విషయాన్ని గమనించి ఫీజును ఆన్లైన్లో ఇంటర్నెట్ సెంటర్ ద్వారా గాని, మీ సేవ సెంటర్ ద్వారా గాని చెల్లించాలని సూచించారు. ఇతర వివరాలకు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

# తెలంగాణకు మోదీ నవ వసంతం

## రేపు హైదరాబాద్ పై ప్రగతి సంతకం.. ₹7,823 కోట్ల అభివృద్ధి పనులు

## బీబీనగర్ ఎయిమ్స్ జాతికి అంకితం.. ఎంఎంటీసీ-2కు శ్రీకారం.. ప్రధాని పర్యటనకు భారీ ఏర్పాట్లు

(మహా ప్రత్యేకం)

తెలంగాణ గడ్డపై ఆదివారం అరుదైన దృశ్యం ఆవిష్కారం కానుంది. మూడవసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి నరేంద్ర మోదీ ఆదివారం తెలంగాణ గడ్డపై అడుగు పెడుతున్నారు. సుమారు ₹7,823 కోట్ల భారీ వ్యయంతో ప్రగతిపనులకు శ్రీకారం చుడుతున్నారు.. తెలంగాణ బీజేపీ మోదీ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బిజెపి చీఫ్ రామచందర్ రావు ఆధ్వర్యంలో మోదీ సభ జయప్రదానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మును పెన్నడూలేనివిధంగా పార్టీ నేతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**పారిశ్రామిక సిరి....జహీరాబాద్ స్మార్ట్ సిటీ**

తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రధాని మోదీ దృఢ సంకల్పానికి నిలువెత్తు రూపం జహీరాబాద్ 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మానుఫ్యాక్చరింగ్ జోన్'. సుమారు 3,245 ఎకరాలలో ₹2,360 కోట్లతో నిర్మించే ఈ స్మార్ట్ సిటీ పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఇది భవిష్యత్తులో ₹10,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పిస్తూ తెలంగాణను పారిశ్రామిక రంగానికి కేంద్రబిందువుగా మార్చనుంది.

**వరంగల్ వైభవం.. టెక్స్‌టైల్ హబ్‌గా విశ్వఖ్యాతి**

రైతుల కష్టం తీరాలి, నేత కార్మికులకు చేతినిండా పని దొరకాలన్న ప్రధాని దార్శనికత 'పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్' రూపంలో సాకారం కానుంది. ₹1,695 కోట్ల వ్యయంతో పూర్తయిన ఈ ప్రాజెక్టును ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. "ఫార్మ్ టు ఫారిన్" లక్ష్యంతో నిర్మించిన ఈ పార్క్ ద్వారా తెలంగాణ పత్తికి అంతర్జాతీయ గుర్తింపు లభించడమే కాకుండా, లక్ష మందికి పైగా ఉపాధి లభించి రాష్ట్రం వస్త్ర ఎగుమతుల్లో విశ్వఖ్యాతి గడించనుంది.

**పరుగులు పెట్టనున్న ప్రగతి రథ చక్రాలు**

మౌలిక సదుపాయాలే అభివృద్ధికి మూలస్తంభాలని నమ్మే మోదీ సర్కార్, రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తోంది. ఇందులో భాగంగా ₹1,243 కోట్లతో పూర్తి చేసిన ఖాజీపేట విజయవాడ మూడవ రైల్వే లైన్‌ను ప్రధాని ప్రారంభిస్తారు. అలాగే మహబూబ్‌నగర్ ప్రాంతం రూపురేఖలు మార్చేలా ₹3,175 కోట్లతో జాతీయ రహదారుల విస్తరణకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులతో లాజిస్టిక్స్ రంగం బలోపేతమై గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభిస్తుంది.

**సామాన్యుడికి సంజీవని.. బీబీనగర్ ఎయిమ్స్**

దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యుత్తమ వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న కేంద్ర ప్రభుత్వ బృహత్తర లక్ష్యం బీబీనగర్ 'ఎయిమ్స్' ద్వారా సాకారం కానుంది. ₹2,000 కోట్లతో సర్వాంగ సుందరంగా, ప్రపంచ స్థాయి వసతులతో నిర్మించిన ఎయిమ్స్ సదుపాయాలను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. ఇది తెలంగాణ ప్రజల ఆరోగ్య భద్రతకు కవచంలా నిలవనుంది.

**ఇంధన భద్రత, గిరిజన విద్యాభివృద్ధికి మోదీ భరోసా**

సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మోదీ సర్కార్ ఇస్తున్న ప్రాధాన్యతకు ములుగులో ₹1,000 కోట్లతో ఏర్పాటు చేయనున్న 'సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం' ప్రత్యక్ష సాక్ష్యం. దీనికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. అలాగే భాగ్యనగర ప్రజల ఇంధన అవసరాలను తీర్చేందుకు మల్లాపూర్‌లో ₹611 కోట్లతో నిర్మించిన అత్యాధునిక పెట్రోలియం టెర్మినల్ ప్లాంట్‌ను సైతం జాతికి అంకితం చేస్తారు.

**యాదాద్రి భక్తులకు కేంద్రం వరం..ఎంఎంటీఎస్**

గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన హైదరాబాద్ శివారు ప్రజల మరియు యాదాద్రి భక్తుల కలను ప్రధాని మోదీ సాకారం చేస్తున్నారు. సికింద్రాబాద్ యాదాద్రి ఎంఎంటీఎస్ ఫేజ్ 2 ప్రాజెక్టును ₹430 కోట్లతో చేపడుతోంది. దీనికి ప్రధాని శంకుస్థాపన చేయడం లక్షలాది మంది ప్రయాణికులకు కేంద్రం ఇస్తున్న భరోసా.

**సమరశంఖం పూరించిన రామచంద్రరావు**

పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు, మేధావి మరియు స్వచ్ఛమైన నాయకుడిగా పేరున్న నారపరాజు రామచంద్రరావుకు బీజేపీ అధిష్ఠానం రాష్ట్ర పగ్గాలు అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచే ఆయన ప్రధాని పర్యటనను "గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు" సాగే ఒక చారిత్రక ఉప్పెనగా మలిచారు. ఆయన వాగ్ధాటి, దిశానిర్దేశం క్యాడర్‌లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

**పరేడ్ గ్రౌండ్స్ లో 'భారీ సభ**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భారీ సభ'ను నిర్వహిస్తోంది. ఎంపీలు కిషన్ రెడ్డి, డా. కె. లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్ వంటి అగ్రనేతల ఆధ్వర్యంలో ఈ సభ కోసం భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు లక్షల మందికి పైగా ప్రజలు తరలివస్తారని అంచనావేస్తున్నారు.

**మహానగరంలో జోరుగా వాల్ రైటింగ్...**
**కమల దళం కవాతు**

ప్రధాని రాకతో హైదరాబాద్ నగరమంతా కాషాయమయమైంది. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ నేతలు క్షేత్రస్థాయికి చొచ్చుకుపోతున్నారు. కిషన్ రెడ్డి, రామచంద్రరావు తదితర అగ్రనేతలు సైతం స్వయంగా బ్రష్ చేతబూని వాల్ రైటింగ్ చేయడం కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని 300 వార్డుల నుంచి లక్షలాది మంది ప్రజలు మోదీ సభకు తరలిరానున్నారు.

**మినీ ఇండియా'ఘనస్వాగతం...**
**మహిళా సాధికారతకు పెద్దపీట**

మహిళా సాధికారతకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్ ప్రధాని మోడీ. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును సాకారం చేసిన మోదీకి కృతజ్ఞతలు తెలిపేందుకు నగరంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు సిద్ధమయ్యారు. తమ సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి వారు ప్రధానికి స్వాగతం పలకడం 'మినీ ఇండియా'ను తలపించనుంది. యువత, మహిళలు మోడీ వెంటే ఉన్నారని ఇది స్పష్టం చేస్తోంది.

**కట్టుదిట్టమైన భద్రత**


ప్రధానికి భద్రత కల్పించడాన్ని రాష్ట్ర పోలీసు యంత్రాంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , డీజీపీ తదితర ఉన్నతాధికారులు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. "బ్లూ బుక్" ప్రొటోకాల్‌ను తూచా తప్పకుండా పాటిస్తూ వందలాది పోలీసు బలగాలతో నగరమంతటా డేగ కన్నుతో నిఘా పెట్టారు. అణువంత లోపం లేకుండా భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు. డిజిటల్ ఇండియా దార్శనికుడైన ప్రధాని సభలో భద్రత కోసం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఆకాశంలో డ్రోన్లతో పహారా కాస్తూ అవాంఛనీయ శక్తులను ఏరివేస్తున్నారు. లాడ్జీలు, హోటళ్లు తనిఖీ చేస్తూ నగరవాసులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్నేహపూర్వక వాతావరణంలో భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

**యువతలో దేశభక్తిని రగిలించే 'వందేమాతరం'**

మోడీ పర్యటనలో యువతను ఉత్తేజపరిచే అద్భుతమైన ఘట్టం మేడ్చల్ మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో జరగనుంది. విద్యార్థులతో కలిసి ప్రధాని మోదీ "వందేమాతరం గీతాలాపన"లో పాల్గొననున్నారు. నవ భారత నిర్మాణంలో యువత పాత్రను గుర్తు చేస్తూ, వారిలో జాతీయవాదాన్ని, దేశభక్తిని రగిలించే ఈ కార్యక్రమం పర్యటనకే హైలైట్‌గా నిలవనుంది.

**ఇదీ ప్రగతి**

సంగారెడ్డి జిల్లాలో ₹2,360.54 కోట్ల వ్యయంతో ఏర్పాటు. దీని ద్వారా 1.74 లక్షల మందికి ఉపాధి లభించడమే కాకుండా, భవిష్యత్తులో ₹10,000 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. వరంగల్ జిల్లాలో ₹1,695.54 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు. ఇది అంతర్జాతీయ వస్త్ర ఎగుమతుల కేంద్రంగా మారి, లక్ష మందికి పైగా ఉపాధిని కల్పిస్తుంది. మహబూబ్‌నగర్ ప్రాంతంలో ప్రాంతీయ అనుసంధానతను మెరుగుపరిచేందుకు రూ.3,175 కోట్ల కేటాయింపు. రూ.1,243 కోట్లతో నిర్మించిన ఈ లైన్ ద్వారా సరుకు రవాణా సామర్థ్యం మరియు ప్రయాణ వేగం పెరుగుతుంది.రూ. 2,000 కోట్ల వ్యయంతో పేదలకు ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు మరియు వైద్య విద్యను అందుబాటులోకి తేవడం. ములుగులో గిరిజన యువతకు ఉన్నత విద్య మరియు పరిశోధనల కోసం ₹1,000 కోట్లతో ఏర్పాటు.భక్తుల సౌకర్యార్థం ఘట్‌కేసర్ నుండి రాయగిరి వరకు ₹430 కోట్లతో సబర్బన్ రైలు మార్గం పొడిగింపు.హైదరాబాద్ నగర ఇంధన భద్రత కోసం ₹611 కోట్లతో 1.6 లక్షల కిలోలీటర్ల సామర్థ్యం గల నిల్వ కేంద్రం.ఐటీ, ఫార్మా, మెడికల్ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు తార్నాకలో రూ.400 కోట్లతో అత్యాధునిక కేంద్రం.హఫీజ్‌పేట , జోగులాంబ రైల్వే స్టేషన్లను ఆధునిక వసతులతో అభివృద్ధి చేయడం.



## దేశవ్యాప్తంగా 5.7 శాతం తగ్గిన నేరాలు

### తెలంగాణలో ఏకంగా 18.7 శాతం పెరుగుదల

### దక్షిణాదిలో మహిళలకు ప్రమాదకర రాష్ట్రంగా తెలంగాణ

### ఎన్సీఆర్బీ సంచలన రిపోర్ట్

### 2024లో ఏకంగా 2.17 లక్షలకు చేరిన క్రిమినల్ కేసులు

### పోలీసు వ్యవస్థ వైఫల్యంపై తీవ్ర విమర్శలు




**హైదరాబాద్, మహా:** ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. దేశమంతా శాంతిభద్రతల దిశగా పటిష్టమైన అడుగులు వేస్తుంటే, మన రాష్ట్రం మాత్రం క్రైమ్ రేట్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ పాతాళానికి పడిపోతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నేరాలు అమాంతం పెరిగిపోవడం సామాన్యుల గుండెల్లో గుబులు రేపుతోంది. దేశవ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడితే, తెలంగాణలో మాత్రం అవి కట్టలు తెంచుకోవడం పాలకుల చేతగానితనాన్ని కళ్లకు కడుతోంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) తాజాగా విడుదల చేసిన సంచలన గణాంకాలు చూస్తే ఎవరికైనా వణుకు పుట్టక మానదు. మహిళలపై దాడులైనా, సాధారణ నేరాలైనా సరే రాష్ట్రంలో విపరీతంగా పెరిగిపోయాయని ఈ రిపోర్ట్ కుండబద్దలు కొట్టింది. నివేదికలోని ఏ ఒక్క లెక్క చూసినా తెలంగాణ భద్రతా వ్యవస్థ ఎంతలా గాడితప్పిందో, ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని స్పష్టమవుతోంది.

**దేశం శాంతిబాటలో..**
**తెలంగాణ నేరాల బాటలో..**

దేశవ్యాప్తంగా ప్రజలకు భద్రత కల్పించడంలో మెరుగైన ఫలితాలు వస్తుంటే, తెలంగాణ మాత్రం పూర్తి విరుద్ధమైన మార్గంలో పయనిస్తోంది. ఎన్సీఆర్బీ లెక్కల ప్రకారం భారతదేశం వ్యాప్తంగా 2022లో 58,24,946 కేసులు నమోదు కాగా, 2023లో 62,41,569 కేసులు నమోదయ్యాయి. అయితే 2024 వచ్చేసరికి కట్టుదిట్టమైన చర్యల వల్ల దేశవ్యాప్తంగా ఈ సంఖ్య 58,85,867 కు పడిపోయింది. అంటే జాతీయ స్థాయిలో చూసుకుంటే నేరాల్లో 5.7 శాతం భారీ తగ్గుదల నమోదు కావడం ఊరటనిచ్చే అంశం. కానీ, సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రం నేరాల నమోదులో దేశానికే సవాల్ విసురుతూ, శాంతిభద్రతల వైఫల్యంలో అగ్రభాగాన నిలవడం ఆందోళనకరం.

**రేవంత్ రెడ్డి సర్కార్‌లో**
**జడలువిప్పిన నేర సామ్రాజ్యం**

మార్పు తెస్తామని అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ప్రజల ప్రాణ, మానాలకు రక్షణ కల్పించడంలో మాత్రం చతికిలపడింది. రాష్ట్రంలో నేరాల గ్రాఫ్ ఎప్పుడూ లేని విధంగా పైకి దూసుకుపోతోంది. 2022లో తెలంగాణలో 1,65,830 క్రిమినల్ కేసులు నమోదు కాగా, 2023 నాటికి అవి 1,83,644కు చేరుకున్నాయి. ఇక రేవంత్ రెడ్డి సర్కార్ పాలనలోని 2024లో అయితే రికార్డు స్థాయిలో ఏకంగా 2,17,976 కేసులు నమోదై ఉమ్మడి రాష్ట్రాన్ని సైతం బెంబేలెత్తిస్తున్నాయి. దేశమంతా 5.7 శాతం నేరాలు తగ్గితే, తెలంగాణలో మాత్రం కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా 18.7 శాతం నేరాలు పెరగడం ప్రభుత్వ పనితీరుకు, పోలీసు యంత్రాంగం నిస్సహాయతకు నిలువుటద్దంగా మారుతోంది.

**దక్షిణాదిలో మహిళలకు అత్యంత**
**అసురక్షిత ప్రాంతం**

మహిళల రక్షణ కోసం బృహత్తర పథకాలు తెస్తున్నామని గొప్పలు చెప్పుకునే పాలకులకు ఎన్సీఆర్బీ గణాంకాలు చెంపపెట్టు లాంటివి. భారతదేశంలో మహిళలపై నేరాలు 2024లో స్వల్పంగా తగ్గినప్పటికీ, తెలంగాణలో మాత్రం ఆ పదం వినిపించడం లేదు. ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాలతో పోల్చి చూస్తే తెలంగాణ మహిళలకు అత్యంత డేంజర్ జోన్‌గా మారిపోయింది. దేశంలో అత్యధిక నేరాలు నమోదయ్యే దక్షిణాది రాష్ట్రాల జాబితాలో తెలంగాణ అప్రతిహతంగా ముందు వరుసలో నిలవడం రాష్ట్ర పరువును బజారున పడేస్తోంది. అర్ధరాత్రి మహిళలు స్వేచ్ఛగా తిరిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అన్న మాటలు తెలంగాణలో కేవలం పుస్తకాలకే పరిమితం అయ్యాయని ఈ లెక్కలు తేల్చి చెబుతున్నాయి.

**అబలలపై అఘాయిత్యాల్లో**
**సిగ్గుచేటు రికార్డులు**

రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అకృత్యాలు రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయి. 2023 సంవత్సరంలో తెలంగాణలో మహిళలపై ఏకంగా 23,678 నేరాలు జరగ్గా, అది ఏమాత్రం కట్టడి కాకపోగా 2024 నాటికి ఈ సంఖ్య ఏకంగా 24,495కు పెరిగిపోయి భయభ్రాంతులకు గురిచేస్తోంది. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట మహిళల అక్రమ రవాణా, దాడులు, వేధింపులు నిత్యకృత్యంగా మారిపోయాయి. నిఘా వ్యవస్థ, షీ టీమ్స్ లాంటి వ్యవస్థలు ఉన్నప్పటికీ వాటి ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదనడానికి ఈ పెరిగిన గణాంకాలే ప్రత్యక్ష సాక్ష్యం. మహిళల భద్రత గాలిలో దీపంగా మారిందన్న విపక్షాల విమర్శలకు ఈ ఎన్సీఆర్బీ డాటా పూర్తి బలాన్ని చేకూరుస్తోంది.

**పొరుగున తగ్గుముఖం..**
**ఇక్కడ మాత్రం ఉన్మాదం**

తెలంగాణ చుట్టుపక్కల ఉన్న రాష్ట్రాలు మహిళా రక్షణలో ముందడుగు వేస్తుంటే మన రాష్ట్రం ఎందుకు వెనుకబడుతుందన్నది అతిపెద్ద ప్రశ్న. ఆంధ్రప్రదేశ్‌లో 2023లో 22,418 నేరాలు జరగ్గా 2024 నాటికి అవి 19,952కి తగ్గాయి. అలాగే కర్ణాటకలో 20,336నుంచి 19,945కు పడిపోయాయి. విద్యావంతులు అధికంగా ఉండే కేరళ రాష్ట్రంలో కూడా 2023లో 16,025గా ఉన్న మహిళల పై నేరాలు, 2024 నాటికి 15,037కి తగ్గుముఖం పట్టాయి. ఇలా పొరుగు రాష్ట్రాలన్నీ తమ పోలీసింగ్ వ్యవస్థను మెరుగుపరుచుకుని నేరాలను నియంత్రిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం చేతులు కట్టుకుని కూర్చుందన్న తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**తమిళనాట స్వల్ప పెరుగుదల..**
**మన దగ్గర దారుణం**

దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ మినహాయిస్తే కేవలం తమిళనాడులో మాత్రమే నేరాలు స్వల్పంగా పెరిగాయి. అక్కడ 2023లో మహిళలపై 8,943 కేసులు నమోదు కాగా, 2024 నాటికి అవి 11,363కి పెరిగాయి. అయితే, పెరిగిన ఆ తమిళనాడు గణాంకాలతో పోల్చినా సరే మన తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న నేరాలు ఏకంగా రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. అంటే దక్షిణ భారతదేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో నేరగాళ్లు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారని, చట్టాలంటే వారిలో ఎలాంటి భయం లేదని ఈ గణంకాలు రూఢీ చేస్తున్నాయి.

**జాతీయ సగటును దాటేసిన**
**క్రైమ్ రేట్.. భద్రత కరువు**

జనాభాకు, పోలీసులకు మధ్య ఉండాల్సిన సమన్వయం రాష్ట్రంలో పూర్తిగా లోపించింది. 2024 అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభా 383.2 లక్షలు కాగా, ప్రతి లక్ష జనాభాకు జరిగే నేరాల రేటు (Rate of Cognizable Crimes) భయపెట్టే స్థాయిలో ఉంది. జాతీయ స్థాయిలో ఈ క్రైమ్ రేట్ సగటు 418.9 గా ఉంటే, తెలంగాణలో అది ఏకంగా 568.9 గా నమోదు కావడం రాష్ట్రంలో పతనమైన శాంతిభద్రతలకు నిదర్శనం. జాతీయ సగటు కంటే ఇంత భారీ స్థాయిలో రాష్ట్రంలో క్రైమ్ రేట్ నమోదు కావడం పాలకుల నిర్లక్ష్యానికి, పర్యవేక్షణా లోపానికి అద్దం పడుతోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా భద్రతా వలయాన్ని విస్తరించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది.

**చార్జిషీట్ల నమోదులోనూ ఘోర వైఫల్యం**

కేవలం నేరాలు జరగడమే కాదు, జరిగిన నేరాలకు న్యాయం చేయడంలోనూ, దోషులకు శిక్ష పడేలా దర్యాప్తు చేయడంలోనూ తెలంగాణ పోలీసు వ్యవస్థ అట్టడుగున నిలిచింది. నేరం జరిగిన తర్వాత చార్జిషీట్ దాఖలు చేయడం అతి ముఖ్యమైన ప్రక్రియ. జాతీయ స్థాయిలో సగటు చార్జిషీటింగ్ రేటు 80.3 శాతంగా ఉంటే, తెలంగాణ రాష్ట్రంలో అది కేవలం 74.2 శాతానికే పరిమితమైపోయింది. అంటే నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ, కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంలో యంత్రాంగం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని స్పష్టమవుతోంది. నేరస్థులకు శిక్ష పడుతుందన్న నమ్మకం సడలిపోవడం వల్లే రాష్ట్రంలో ఈ స్థాయిలో క్రైమ్ రేట్ పెరిగిపోతోందని, తక్షణం ప్రభుత్వం మేల్కొకపోతే తెలంగాణకు తీరని నష్టం వాటిల్లుతుందని నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

## రాజకీయం ప్రజాసేవకు వేదిక...

# ప్రతీకారానికి కాదు



ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సహజం. సిద్ధాంతాలు వేరు కావచ్చు, అభిప్రాయాలు భిన్నంగా ఉండొచ్చు. విమర్శలు, ప్రతివిమర్శలు కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగమే. విభిన్న అభిప్రాయాలు ఉండటం వల్లే ప్రజాస్వామ్యం బలపడుతుంది. కానీ ఆ విభేదాలు హద్దులు దాటి వ్యక్తిగత విద్వేషాలకు, దాడులకు, విధ్వంసాలకు దారి తీస్తే అది ప్రజాస్వామ్య స్ఫూర్తినే దెబ్బతీస్తుంది. ఆలోచనలతో పోరాడాల్సిన రాజకీయాలు ఆవేశాలకు, ప్రతీకారాలకు వేదికగా మారితే ప్రజల్లో రాజకీయాలపై నమ్మకం దెబ్బతింటుంది.. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి ఘటన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, రాజకీయ విభేదాలను హింసతో వ్యక్తం చేయడం సమర్థనీయం కాదు. కార్యాలయాలపై దాడులు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, భయాందోళనలు సృష్టించడం ద్వారా ఎలాంటి సమస్యకూ పరిష్కారం లభించదు. పైగా ఇలాంటి ఘటనలు సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో మాటకు బదులు ఘర్షణకు అది ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది. ప్రజాస్వామ్యంలో విమర్శకు సమాధానం సద్విమర్శే కావాలి... దాడి కాదు. ఎవరి వ్యాఖ్యలు అసహనాన్ని కలిగించినా, వాటికి సమాధానం వాస్తవాలతో, చర్చలతో, ప్రజల ముందుంచే తర్కబద్ధమైన వాదనలతో ఇవ్వాలి. అదే రాజకీయ పరిపక్వతకు నిదర్శనం. హుందాగా చేసే ప్రతివిమర్శ నాయకుడి స్థాయిని పెంచుతుంది. కానీ శారీరక దాడులు, విధ్వంసాలు మాత్రం రాజకీయ బలహీనతను బయటపెడతాయి.

ఒకప్పుడు రాజకీయాల్లో తీవ్రమైన వాదోపవాదాలు జరిగినా పరస్పర గౌరవం కనిపించేది. సభల్లో ఘాటుగా విమర్శించుకున్న నాయకులే సభ ముగిసిన తర్వాత మర్యాదగా పలకరించుకునేవారు. సిద్ధాంతాలపై పోరాటం ఉండేది గానీ వ్యక్తిగత శత్రుత్వం ఉండేది కాదు. అదే రాజకీయ సంస్కారం. అదే ప్రజలకు ఆదర్శం. నేడు అలాంటి హుందాతనం తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాజకీయాలు విలువల ఆధారంగా నడవాల్సింది పోయి వ్యక్తిగత కక్షల చుట్టూ తిరగడం ప్రజాస్వామ్యానికి శుభసూచకం కాదు. ఇలాంటి ఘటనలను కేవలం రెండు పార్టీల మధ్య ఘర్షణగా మాత్రమే చూడలేం. నాయకులు ఎలా ప్రవర్తిస్తే కార్యకర్తలు కూడా అదే బాటలో నడుస్తారు. నాయకత్వం సంయమనం కోల్పోతే అది కిందిస్థాయికి కూడా వ్యాపిస్తుంది. చివరకు రాజకీయ చైతన్యం కంటే రాజకీయ వైరం పెరుగుతుంది. ప్రజల్లో విభజన పెరుగుతుంది. దీని ప్రభావం సామాన్య ప్రజలపైనే తీవ్రంగా పడుతుంది. ప్రజలు నాయకుల నుంచి ఆశించేది పరస్పర దాడులు కాదు... అభివృద్ధిపై పోటీ. దూషణలు కాదు... ప్రజా సమస్యల పరిష్కారం. ఆరోపణలు కాదు... ప్రజలకు ఉపయోగపడే కార్యాచరణ. రోడ్లు, విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం వంటి అంశాలపై ఎవరు మెరుగ్గా పనిచేస్తారన్న ఆరోగ్యకర పోటీనే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం. ప్రజలు ఓటు వేయడం నాయకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవాలని కాదు.. తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని.. రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. ప్రతీకారం తాత్కాలిక సంచలనాన్ని సృష్టించొచ్చు, కానీ సంస్కారవంతమైన రాజకీయం మాత్రమే శాశ్వత గౌరవాన్ని తెస్తుంది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వారు మాటల్లో, చేతల్లో మరింత సంయమనం పాటించాలి. ప్రజల ముందు ఆదర్శంగా నిలవాలి. కరీంనగర్ ఘటన అందరికీ ఒక హెచ్చరిక కావాలి. విమర్శలు హద్దుల్లో ఉండాలి. విభేదాలు చర్చలతో తేలాలి. అభిప్రాయ భేదాలు వాదనలతో పరిష్కారం కావాలి. దాడులు, విధ్వంసాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కావు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అసలు బలం ఆలోచనల పోరాటంలో ఉంటుంది గానీ, అరాచకాలలో కాదు. సంస్కారవంతమైన రాజకీయం తాత్కాలిక సంచలనాలకన్నా శాశ్వత గౌరవాన్ని తెస్తుంది. రాజకీయం ప్రజాసేవకు వేదిక... ప్రతీకారానికి కాదు.



- గొట్టిముక్కుల బ్రహ్మాచారి
9441884389

# షరతులు లేకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

- రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్
- రైతు సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా



**జూలూరుపాడు, మహా:** ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సంద్ర నరేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలలో వేలాది బస్తాలు ధాన్యం, మూలుగుతోందని అన్నారు. అడ్డగోలు నిబంధనలతో అధికారులు పలు విధాలుగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. పంట వివరాలను నమోదు చేయడానికి యాప్ మూసివేశారని, దీనిపై అవగాహన లేక పంట వివరాలు నమోదు చేయలేదని తెలిపారు. అధికారులు రైతు యాప్ ను నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సక్రమంగా ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. దీనిని అవకాశం గా తీసుకున్న పలువురు ప్రైవేట్ వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు అకాల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు, మరో వైపు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి పంట నష్టం జరుగుతుందని అన్నదాతలు దిగులు చెందుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రాత్రి పగలు తేడా లేకుండా కాపు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమ ధ్యేయమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలో ఘోరంగా విఫలం చెందుతుందని విమర్శించారు. ఇకనైనా షరతులు లేకుండా రైతులు పండించిన మొత్తం పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల యావత్ రైతాంగాన్ని సమీకరించి ఆందోళన కు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య, ఎల్లంకి మధు, తూము కోటయ్య, సిరిపురపు వెంకటేశ్వర్లు, గార్లపాటి వీరభద్రం, ఎల్లంకి శీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సత్యనారాయణపురం గవర్నమెంట్ హాస్పిటల్

### గర్భిణీలలో రక్తహీనత, తలసేమియాపై అవగాహన సదస్సు



**చర్ల మహా:** చర్ల మండలం సత్యనారాయణపురం ప్రభుత్వ ఆసుపత్రిలో 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి నైని మాట్లాడుతూ, గర్భిణీ సమయంలో వచ్చే రక్తహీనత, తలసేమియా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. గర్భిణీలు తప్పనిసరిగా పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు.ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు మాట్లాడుతూ, మన చుట్టూ పక్క ఏరియాలో గిరిజన మహిళలు తలసేమియా, రక్తహీనతతో బాధపడుతున్నారని, గర్భం దాల్చిన మొదలు ప్రసవం వరకు ప్రతి వారం ప్రభుత్వ డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకొని తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణపురం పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయండి



**నేలకొండపల్లి, మహా:** వికసిత భారతావని లక్ష్యంగా దేశాన్ని ప్రగతి పథంలో పయనింప చేస్తున్న ప్రధాని నరేంద్ర మోది బహిరంగ సభ ను జయప్రదం చేయాలని బిజెపి ముస్లిం మైనార్టీ మోర్చా జిల్లా నాయకులు సయ్యద్ మోహినుద్దీన్ కోరారు. నెలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు...తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ ఈ నెల 10వ తేదీన 8 వేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు హైదరాబాద్ రానున్న నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్స్ లో ఈ నెల 10 వ తారీఖున సాయంత్రం 3 గంటలకు జరిగే బహిరంగ సభలో నరేంద్ర మోడీ పాల్గొని ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు. నేపథ్యంలో ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం నుండి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి బిజెపి కార్యకర్తలు సానుభూతిపరులు తరలిరావాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో మైనారిటీ మోర్చా నేలకొండపల్లి మండల నాయకులు షర్ఫుద్దీన్ ఉన్నారు.

## ఆకాశవాణి 90 వసంతాల వార్షికోత్సవ వేడుకలు




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** 90 వసంతాల ఆకాశవాణి వార్షికోత్సవ వేడుకలు(1936 2026) వాయిస్ ఆఫ్ నేషన్ లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం నుండి 3కే వాక్తాన్ నిర్వహించారు. వాక్తాన్ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ టి.భరత్ తొలత జెండా ఊపి ప్రారంభించారు. కొత్తగూడెం రేడియో స్టేషన్, 14 నంబర్ ఏరియా, రామవరం సెంటర్, నుండి తిరిగి 2టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా రేడియో స్టేషన్ వరకు సాగిన ఈ వాక్తాన్ కార్యక్రమంలో స్టేషన్ ప్రోగ్రాం హెడ్ కొలిపాక శంకరరావు పాల్గొని మాట్లాడారు. ఆకాశవాణి 90 వసంతాల ఉత్సవాలు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. 1936 ముందు దక్కన్ రేడియోగ ఉన్న రేడియో కార్యక్రమంలో ఆకాశవాణిగా రూపాంతరం చెందింది. 2026నాటికి 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత దేశంలోని అన్ని రేడియో కేంద్రంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి మాధ్యమాలు అందుబాటులో లేని సమయంలో ఆకాశవాణి ప్రజావాణిగా వర్ధిల్లింది. నాటి నుండి నేటి వరకు గ్రామీణ ప్రాంత ప్రజలను రైతులను అలరిస్తూ మారుమూల గ్రామాలలో సైతం ఆకాశవాణి జనరంజకంగా ప్రసారాలను ప్రసారం చేస్తుందని తెలిపారు. బహుజన హితాయ: బహుజన సు:ఖాయ: నినాదంతో....ప్రకృతి వైపరీత్యాలు విపత్తులు తుఫానులు ఏర్పడిన సందర్భంలో ఆకాశవాణి నిర్దిష్టమైన సమాచారం చేరవేస్తు ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుంది.ఈ నేపథ్యంలో 90 వసంతాల సందర్భంగా కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం "వాక్ తాన్ " కార్యక్రమాన్ని నిర్వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్, రామవరం పశు వైద్యులు డాక్టర్ ఆనంద్, పర్యావరణ ప్రేమికుడు నూర్వి రాజశేఖర్, స్టేషన్ సిబ్బంది, రేడియో వ్యాఖ్యాతలు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణిలో అధికారులకు ఉద్యోగులకు శిక్షణ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఎస్ఏపి ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్ (ఎఫ్ఎల్ఎం)అప్లికేషన్ (ఈఆఫీస్)పై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సింగరేణి కార్పొరేట్ పరిధిలోని అన్ని శాఖల జనరల్ మేనేజర్లు అధికారులు ఉద్యోగులకు రెండు రోజులపాటు జరిగే శిక్షణ తరగతుల కార్యక్రమం శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రారంభించటం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో సింగరేణి సంస్థలో నందు గల ఫైల్‌లు, డాక్యుమెంట్‌లు కరస్పాండెన్స్‌ల వివరాలను ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్ అప్లికేషన్ (ఈఆఫీస్) రూపంలో డిజిటల్ మాధ్యమంలో పొందుపరచటానికి కార్పొరేట్ పరిధిలోని అన్ని శాఖల జనరల్ మేనేజర్లు అధికారులు ఉద్యోగులకు రోజు వారి చేసే నోట్ ఫైల్స్, సర్క్యులర్స్, డాక్యుమెంట్స్ ఇతర ఆఫీస్ కరస్పాండెన్స్ లెటర్స్ వంటి వాటిని ఈ నూతన డిజిటల్ విధానంలో ఎలా చేయాలో ప్రత్యక్ష ఉదాహరణల ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. జిఎం(హెచ్ఆర్డి) ఆర్. విజయ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, జిఎం(ఈ అండ్ఎం) ఓసిపి పి.ఎలిషా, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్సి ఏజేఎం. మురళీధర్ రావు, జిఎం(ఐ అండ్ పిఎం) ఎం.శ్రీహరి, ఇతర అధికారులు, ఉద్యోగులు హెచ్ఆర్డి డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేప పిల్లలు గడువు దాటి ఇస్తే ఏం ప్రయోజనం...!



- మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్న మత్స్యకారులు
- మత్స్యశాఖ అధికారుల తీరు పై మండిపడ్డ మత్స్యకారులు

**నేలకొండపల్లి, మహా:** చెరువులలో ప్రభుత్వం ఉచితంగా అందించే చేప పిల్లల పెంపకం కోసం ఇచ్చే పిల్లలను గడువు దాటిన తరువాత అందిస్తున్నారని మత్స్యకారులు మండిపడ్డారు. అధికారుల తీరుతో నష్టపోతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక లో భాగంగా స్థానిక రైతు వేదిక లో శుక్రవారం మత్స్యకారులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ అధికారులు మాట్లాడుతుండగా... మత్స్య సొసైటీ ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. చెరువులలో సమయం, కు చేప పిల్లలు ఇవ్వకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీని వలన చేప పిల్లల పెంపకం పై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలస్యం గా చేప పిల్లలు ఇవ్వటం ఎవరికి ప్రయోజనం ఉందని ప్రశ్నించారు. చేప పిల్లలో పంపిణీలో జిల్లా అధికారులు వైఫల్యం చెందారని ఆరోపించారు. చేప పిల్లల పంపిణీ పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అలా కాకుండా చెరువులకు విస్తీరణం ను బట్టి నిధులు సొసైటీలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మత్స్యకారుల అధికారుల వైఖరి పై తీవ్ర విమర్శలు చేశారు. ఇది ఇలా ఉండగా మత్స్యకారుల అవగాహన సదస్సు పై సమాచారం లేకుండా నిర్వహించటంతో కొద్దిమంది మాత్రమే హజరయ్యారు. వారు కూడ మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినవచ్చాయి. ఈ సదస్సులో మండల ఇంచార్జ్ వ్యవసాయాధికారి అరుణ, కె.వీ.కె.శాస్త్రవేత్త పల్లవి, ఏఈవోలు దాత్రి, అవినాష్, మత్స్యపారిశ్రామిక సోసైటీ ప్రతినిధులు మైశా శంకర్, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, బోయిన బలరాం, చింతల నరసింహారావు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నీటి కొరత తీర్చిన సర్పంచ్

### అభినందించిన తండా వాసులు



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ లోని దేశ్య తండా వాసులు గత కొన్నేళ్లుగా నిత్యవసరాలకు నీళ్లు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో పంచాయితీ ట్యాంకర్ నేలతో తమ అవసరాలను సరిపెట్టుకున్న రోజులు ఉన్నాయి. విషయాన్ని గమనించిన గ్రామ నూతన సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, గ్రామ కార్యదర్శి బి హారిక కృషి, స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో సుమారు 7 లక్షల రూపాయల డీఎంఎఫ్టి నిధులతో నూతన బోరు మోటర్ తో పాటు ప్రత్యేకంగా త్రీఫేస్ ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. శుక్రవారం నూతన మోటార్ ను గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి కార్యదర్శి బి హారిక తో కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తండా వాసులు తమ అవసరాన్ని గుర్తించి సకాలంలో నీటి కొరతను తీర్చిన సర్పంచ్, కార్యదర్శులకు కృతజ్ఞత అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలక మండల సభ్యులు బాదావత్ రామకోటి, నాగరాజు తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ళ అప్పిరెడ్డి, గోసు రామారావు, తెల్లబోయిన మల్లికార్జునరావు, సంఘం చిన్న రాజు, బాదావత్ హరీష్, లేళ్ళ నవీన్ రెడ్డి, పెరుగు తిరుమలరావు, తండా పెద్దలు మాన్ సింగ్, జగ్యా, భీమ్లా నాయక్, పూల్ సింగ్, పూల్య తోపాటు మహిళలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సుజాతనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగం ఇన్ పేషెంట్ విభాగం మందుల గది సిబ్బంది హాజరు నమోదు పత్రాలు ఔట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి రోజువారీగా నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు ఇతర నిర్ధారణ పరీక్షల నిర్వహణ ల్యాబ్ సేవల పరిస్థితి పరీక్షల ఫలితాలను రోగులకు సమయానికి అందిస్తున్న విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల స్టాక్ అవసరమైన మందుల లభ్యత రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డులు మరుగుదొడ్లు తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.అనంతరం సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిల్వలు రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం మొక్కజొన్న నిల్వల వివరాలను పరిశీలించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొక్కజొన్న తరలింపునకు తగినన్ని లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లోడింగ్ రవాణా సమస్యల కారణంగా మొక్కజొన్న కేంద్రంలోనే నిల్వ ఉండిపోతుందని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే తగినన్ని లారీలు ఏర్పాటు చేసి రవాణా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పి.ఆర్126 రకం ధాన్యంలో “పిన్ పాయింట్ డ్యామేజ్” ఉన్నదనే కారణంతో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని స్వీకరించడం లేదని రైతులు వివరించగా దీనిపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రైతుల ధాన్యం ఎక్కడా నిల్వ ఉండకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైనన్ని గన్నీ బ్యాగులు టార్పాలిన్లు తాగునీరు తేమ కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం రవాణా నిల్వ లోడింగ్ తదితర అంశాలలో సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, వైద్య అధికారులు డాక్టర్ రమేష్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తా..



**నేలకొండపల్లి, మహా:** సొసైటీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సొసైటీ అధ్యక్షుడు మైశా శంకర్ పేర్కొన్నారు. నేలకొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ కార్యదర్శి ఖమ్మం వెంకటేశ్వర్లు, సిబ్బంది తో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. సొసైటీ ఆర్థిక పరిస్థితి, ఆదాయ, వ్యయాలు, రుణాలు, రికవరీ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... సొసైటీ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. తన పై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మంత్రి శ్రీనివాసరెడ్డి కి. కృతజ్ఞతలు ' తెలిపారు. వారి నమ్మకం ను వమ్ము చేయకుండా మంచి పాలన ను అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ "కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది కనపర్తి నాగేంద్రబాబు, సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది కనపర్తి నాగేంద్రబాబు, సొసైటీ డైరెక్టర్లు మన్నె కృష్ణారావు, కనకబండి కనకరాజు, అనిల్కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మాట ఇచ్చారు...నిలబెట్టుకున్నారు...!

### ప్రతిభ చూపిన విద్యార్థులకు సైకిళ్లు అందజేత

**నేలకొండపల్లి, మహా:** పది లో అత్యుత్తమ ప్రతిభ చూపే వారికి తన సొంతంగా సైకిళ్ల ను అందిస్తానని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైనీ మాట ఇచ్చారు.... ఈమేరకు శుక్రవారం ఆ మాట ను నిలబెట్టుకున్నారు. మండలం లో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ను సొంత నిధులతో అందించారు. ఆ సమయంలో విద్యార్థులకు మాట ఇచ్చారు...పది లో మండల స్థాయి లో ఫలితాలు సాధించిన వారికి సైకిళ్ల ను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మండలం లో చిట్టెంశెట్టి మహేష్ 600 మార్కులకు గాను 564 మార్కులు. మోత్కూరి రక్షిత 537 మార్కులు సాధించారు. వీరికి డీఈవో.సైకిళ్ల ను అందించారు. అదే విధంగా మండల టాఫర్ మహేష్ ఉన్నత చదువుల కు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సులబ్ కాంప్లెక్స్ ను ఉపయోగంలోకి తీసుకురండి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పాల్వంచ నవ భారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో బస్టాండ్ పక్కన నిర్మించబడిన సామూహిక మరుగుదొడ్ల సదుపాయం గత కొన్ని రోజులుగా మూతపడి ఉన్నదని దీనిని వెంటనే తెరిపించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బస్టాండ్ ఆటో స్టాండ్ ఆటో వర్కర్స్ యూనియన్ అడ్డ అధ్యక్షుడు అరెల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు. మూతపడ్డ మరుగుదొడ్ల కాంప్లెక్స్ ముందు శుక్రవారం ఆయన మాట్లాడారు. వాడుక సమయంలో ఎందరికో ఉపయోగపడిన ఈ టాయిలెట్ ఇప్పుడు నిరుపయోగంగా ఉండడం వల్ల ఆటో స్టాండ్ వద్ద సోదరులు స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం నగరపాలక సంస్థ లేక సింగరేణి సంస్థ వారైన స్పందించి మూతపడ్డ మరుగుదొడ్లలను తెరిపించే విధంగా చూడాలని కోరారు. లేకుంటే నవ భారత్ ఎనర్జీ సంస్థ సులబ్ కాంప్లెక్స్ వాడుకలోకి తీసుకురావాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ సహాయ కార్యదర్శి బాబుజానీ పట్టణ ఉపాధ్యక్షుడు దేశీ అడ్డ ఉపాధ్యక్షుడు నరసింహా కార్యదర్శి రాజేందర్ చిన్ని బిక్కు లాల్ తదితరులు పాల్గొన్నారు.



## బాంబు డిస్పోజల్ బృందం సిబ్బందిని అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రతా బలగాలతో పాటు సంయుక్తంగా నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్లలో మావోయిస్టులకు సంబంధించిన 06 డంప్ లను, 05 ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో సమర్థవంతంగా విధులను నిర్వర్తించిన జిల్లా బాంబు డిస్పోజల్ బృందం సభ్యులను ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటు చేసినటువంటి 10 ఐఇడిలను కనుగొని వాటిని అత్యంత చాకచక్యంగా నిర్వీర్యం చేసిన బీడీ టీం సిబ్బందిని అభినందిస్తూ క్లిష్ట పరిస్థితులలో బీడీ టీం ప్రదర్శించిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు ఎంతో గర్వకారణమని కొనియాడారు. సిబ్బందికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు సూచనలు చేస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అటవీ ప్రాంతాలలో తనిఖీలు చేసేటప్పుడు నిర్ణీత నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్వీయ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచనలు చేశారు. నూతన ఉత్సాహంతో పనిచేస్తూ ప్రతిభ కనబరిచిన 12 మంది బీడీ టీం పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలు రివార్డులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆపరేషన్స్ రవి, బీడీ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్

**సత్తుపల్లి, మహా:** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 15న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని రామానగరం గ్రామంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి సమస్యల పరిష్కారానికి ఈనెల 15న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా చేసిన పోరాటాల ఫలితంగా పార్లమెంట్లో వామపక్షాల మద్దతుతో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ప్రతి కుటుంబానికి 100 రోజుల పని గ్యారెంటీ చేస్తూ ఉపాధి హామీ చట్టాన్ని 2005 సంవత్సరంలో ఆమోదించిందన్నారు. ఆ చట్టాన్ని 2006 అక్టోబర్ లో దేశవ్యాప్తంగా అమలు చేశారని తెలిపారు. ఈ ఉపాధి హామీ చట్టంతో కోట్లాదిమంది వ్యవసాయ కార్మికులకు చిన్న, మధ్యతరగతి రైతాంగానికి చేతినిండా పని దొరికిందని, గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు పని కోసం పేదల వలసలు తగ్గాయని అన్నారు. 2006 ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలను పెంచే విధంగా ద్రోహదపడిందని,ఆడ, మగా తేడా లేకుండా సమాన వేతనాలు దేశంలో మొదటిసారి అమలు జరిగినాయి అన్నారు. కోట్లాది రూపాయలను కేంద్ర ప్రభుత్వం వేతనాల రూపంలో పేదలకు ఇవ్వడంతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. పేదరికం, అప్పుల ఊబి నుండి కోట్లాది నిరుపేద కుటుంబాలు బయటపడ్డాయి వివరించారు. 2008 వ సంవత్సరంలో ప్రపంచంలో ఆర్థిక మాద్యం వచ్చినప్పుడు, 2019 లో కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు భారతదేశ ప్రజలను బ్రతికించింది ఉపాధి హామీ చట్టమేనని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో విబిజి రాంజీ బిల్లు ప్రవేశపెట్టిందని, ఉపాధి హామీ పథకానికి గతంలో 90 శాతం నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితుల్లో 60 శాతం నిధులు కేటాయించి 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం పెంచిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సుడా చైర్మన్ దుర్గాప్రసాద్ కు ఘన సన్మానం



**నేలకొండపల్లి, మహా:** ఖమ్మం సుడా చైర్మన్ గా నియమితులైన పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ను మండల నాయకులు ఘనంగా సన్మానించారు. మండలం లోని పైనంపల్లి లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....తన పై నమ్మకంతో ఉంచిన బాధ్యత ను మంత్రుల సహకారంతో సమర్ధవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సాధు రమేష్రెడ్డి, శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్.. సర్పంచ్ లు తేజావత్ శివాజీ, బోయిన వేణు, కోటేశ్వర రావు, సూరేపల్లి ఎం ఎస్ జి ప్రేమ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చురకత్తిలాంటి చూపులతో చితకొట్టిన భాగ్యశ్రీ బోర్సే..

భాగ్యశ్రీ బోర్సే గురించి ప్రత్యేకంగా చెప్పాలిసిన పని లేదు.. 'మిస్టర్ బచ్చన్' సినిమా ఈ ముద్దుగుమ్మ అందాలు చూసి పిచ్చెక్కిపోయారు కుర్రకారు. హరీష్ శంకర్ డైరెక్షన్ లో రవితేజ హీరోగా తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ బచ్చన్' తో తెలుగు తెరకు పరిచయమైంది ఈ చిన్నది. మిస్టర్ బచ్చన్ సినిమావిడుదలకు ముందే టాలీవుడ్ లో సెన్సేషన్ క్రియేట్ చేసింది భాగ్యశ్రీ బోర్సే. కానీ ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద బోల్తా పడింది.అయితే ఈ సినిమా డిజాస్టార్ అయిన భాగ్యశ్రీకి వరుస ఆఫర్స్ క్యూ కడుతున్నాయి. భాగ్యశ్రీ బోర్సే స్వస్థలం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్. మొట్టమొదట మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి తరువాత బాలీవుడ్ లో యారియాన్ 2 సినిమాతో సినీరంగ ప్రవేశం చేసింది.ప్రస్తుతం అఖిల్ అక్కినేని సరసన 'లెనిన్'లో హీరోయిన్‌గా నటిస్తోంది. త్వరలోనే ఓ లేడీ ఓరియెంటెడ్ మూవీ చేయబోతున్నట్లుగా టాక్ నడుస్తోంది. 'లెనిన్'లో శ్రీలీల తప్పుకోవడంతో వెంటనే, ఆమె ప్లేస్‌ని రీప్లేస్ చేసింది. 'లెనిన్'పై ఈ భామ ఎన్నో ఆశలు పెట్టుకుంది. హిట్ కొడతానని ధీమాగా ఉంది.



## క్రేజీ హీరోయిన్ సీక్రెట్ లవ్ స్టోరీ..
# అతను ఎవరో కాదు..

మనం టీవీ చూస్తున్నప్పుడో లేదా ఫోన్ స్క్రోల్ చేస్తున్నప్పుడో ఏదో ఒక రూమర్ మన కంట పడుతూనే ఉంటుంది. అందులోనూ సినీ తారల పెళ్లి, ప్రేమ విషయాలైతే ఇట్టే వైరల్ అయిపోతాయి. చాలా కాలంగా సైలెంట్‌గా ఉంటున్న పూజా హెగ్డే, ఇప్పుడు మళ్ళీ వార్తల్లో నిలిచింది. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ, ప్రస్తుతం కాస్త గ్యాప్ తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ గ్యాప్‌ని ఆమె వృధా చేయడం లేదు, తన పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేయడానికి కేటాయిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, పూజా హెగ్డే బాలీవుడ్ నటుడు రోహన్ మెహ్రాతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. రోహన్ మెహ్రా ఎవరో కాదు, ఒకప్పటి లెజెండరీ నటుడు వినోద్ మెహ్రా కుమారుడు. వీళ్లిద్దరూ కలిసి రీసెంట్‌గా చాలా ఈవెంట్లలో జంటగా కనిపించారు. మొదట్లో ఇది కేవలం స్నేహం అనుకున్నారంతా, కానీ ఇప్పుడు సీన్ మారింది. తాజాగా పూజా ఒక ఆధ్యాత్మిక యాత్రకు వెళ్ళింది, అక్కడ కూడా రోహన్ ఆమెతోనే ఉన్నాడట. దీనికి సంబంధించిన ఫోటోలు బయటకు రాకపోయినా, ఇన్సైడ్ టాక్ మాత్రం గట్టిగానే వినిపిస్తోంది. సాధారణంగా పూజా తన వ్యక్తిగత విషయాలను చాలా సీక్రెట్‌గా ఉంచుతుంది. గతంలో కూడా కొందరు హీరోలతో ఆమె పేరు ముడిపెట్టినా, ఆమె ఎప్పుడూ స్పందించలేదు. కానీ ఇప్పుడు రోహన్‌తో ఆమె క్లోజ్‌గా ఉంటున్న తీరు చూస్తుంటే, ఇది కేవలం పుకారు మాత్రమే కాదు అనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా సినిమాలు లేకపోవడం కూడా ఈ డేటింగ్ వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. 35 ఏళ్ల వయసులో ఉన్న పూజా, తన లైఫ్ పార్ట్‌నర్‌ను వెతుక్కునే పనిలో పడిందా అనే చర్చలు ఫిల్మ్ నగర్‌లో జోరుగా సాగుతున్నాయి. ఏదేమైనా, ఈ బుట్టబొమ్మ తన రిలేషన్‌షిప్‌ను అఫీషియల్‌గా ఎప్పుడు అనౌన్స్ చేస్తుందో చూడాలి. మనసులో మాట బయటపెడితే ఫ్యాన్స్ కూడా హ్యాపీగా ఫీలవుతారు కదా!



## అలాంటి సినిమాల్లో ఛాన్స్ వస్తే ఖచ్చితంగా చేస్తా..
### మనసులో మాట బయటపెట్టిన ఫరియా అబ్దుల్లా

అందాల భామ ఫరియా అబ్దుల్లా వరుస సినిమాలతో దూసుకుపోతుంది. హిట్లు ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది ఈ అందాల తార. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది ఈ చిన్నది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది ఈ ముద్దుగుమ్మ. త్వరలోనే భగవంతుడు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది . తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఫరియా అబ్దుల్లా ఆసక్తికర విషయాలను పంచుకుంది. నటి తన కెరీర్ ప్రయాణంలో వంద కోట్ల రూపాయలు వసూలు చేసే చిత్రాలు, స్టార్‌డమ్‌పై కాకుండా తన సృజనాత్మక ప్రాధాన్యతలకు కట్టుబడి ఉన్నట్లు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపింది. అధిక పారితోషికం, కమర్షియల్ విజయం ఒకవైపు ఉన్నప్పటికీ, ఆమె తన ప్రత్యేకమైన మైండ్‌సెట్‌తో విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతుంది. ఫరియా మాట్లాడుతూ.. వంద కోట్ల సినిమా ఆఫర్ వస్తే నేనెందుకు చేయను. ? చేస్తాను కదా," అని నవ్వుతూ చెప్పింది. చిట్టి వంటి పాత్రల ద్వారా వచ్చిన అభిమానుల ఆదరణే తన నిజమైన ప్రేరణ అని ఆమె తెలిపింది.. జాతిరత్నాలు చిత్రంలో చిట్టి పాత్రకు డబ్బింగ్ చెప్పిన అనుభవం గురించి మాట్లాడుతూ.. ఆ చిత్రానికి ఎంపికయ్యే సమయానికి ఆమెకు తెలుగు సరిగా రాదని చెప్పింది. అయినా, తన వాయిస్‌కి ప్రజల నుంచి వచ్చిన ఆదరణ చూసి ఆశ్చర్యపోయానని తెలిపింది. షూటింగ్ సమయంలో తెలుగు మాట్లాడే వారితో కలిసి ఉండటం ద్వారా భాషను నేర్చుకున్నానని, స్టేజ్‌పై ధైర్యంగా మాట్లాడగలిగానని ఆమె చెప్పుకొచ్చింది. ఇది కేవలం ఆమె నటనకు మాత్రమే కాకుండా, ఆమె వాయిస్‌కి కూడా లభించిన ప్రశంస అని తెలిపింది. తన తాజా చిత్రం గాయపడ్డ సింహం గురించి మాట్లాడుతూ.. తన పాత్ర పరిచయ సన్నివేశం ఎలా ఉండేదో వెల్లడించారు. తాను స్టేజ్‌పై చాలా "చెత్తగా" డ్యాన్స్ చేస్తుండగా, హీరో తన స్నేహితుడితో "ఇంత చెత్తగా డ్యాన్స్ చేస్తుందంటే కచ్చితంగా నాకు పడుద్దిరా" అని చెప్పే సన్నివేశాన్ని ఆమె పంచుకుంది. ఈ జోక్ వినగానే తాను ఈ పాత్ర చేయడానికి అంగీకరించానని తెలిపింది. గాయపడ్డ సింహం సినిమా విషయంలో తనకు నమ్మకాన్ని కలిగించిన అంశాలను వివరిస్తూ, తరుణ్ భాస్కర్ ఈ చిత్రానికి ఓకే చెప్పడం ప్రధాన కారణమని.. పవన్ సాధినేని డైరెక్టర్‌ను, కథను సిఫార్సు చేయడంతో పాటు, ఒక ప్లాట్‌లైన్ వినగానే ఇది కామెడీగా ఉంటుందని, ఎవరూ ఊహించని విధంగా ఉంటుందని భావించి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చానని తెలిపింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com